అగ్నినేత్రాలు

ఏ. యస్. రావ్

నిలువుటద్దం ముందు అతను ఠీవిగా నిలబడ్డాడు.

నీలంరంగు పాంటులోకి దోపిన కాలర్ లేని ఎర్రషర్టు. సన్నటి నడుముని పాములా చుట్టుకున్న వెడల్పాటి లెదర్ బెల్టు. నిగనిగలాడుతున్న బూట్లు, కండలు తిరిగి, కడ్డీలావున్న తన పొడుగాటి శరీరాన్ని అతను తృప్తికరంగా అద్దంలో చూసుకున్నాడు.

సగం నుదుర్ని కప్పేసిన క్రాపు కిందినుంచీ కళ్ళు సాన పెట్టిన వజ్రాల్లా చూస్తున్నాయి. నవ్వుతో విచ్చుకుంటున్న పెదవులమధ్య ఇరుక్కున్న సిగరెట్టు కదిలింది. పొగ జొరబడకుండా కళ్ళు సగం మూసుకునివున్నాయి.

టక్ టక్ టక్....తలుపుమీద వేళ్ళ కణుపులు చప్పుడు చేశాయి. అతను వాచీ చూసుకున్నాడు. సరిగ్గా పది గంటలు. బాగా బలిసిన గిత్త అర్రులావున్న తన మెడని అరచేత్తో ప్రేమగా రుద్దుకుంటూ అతను తలుపువేపు చూశాడు.

"కమిన్!" ప్రముఖ నటుడు స్వర్గీయ కె. వి. యస్. శర్మకంఠంలా అతని కంఠం గంభీరంగా ధ్వనించింది.

సన్నగా పొడుగ్గావున్న వ్యక్తి తలుపు తోసుకుని లోపలకు ప్రవేశించాడు. వీపుతో తలుపుమూసి అలాగే నిలబడి, తన ఎదురుగా స్తంభంలా నిలబడ్డ పరమేశ్వర్ ని చిరునవ్వుతో చూశాడు.

పరమేశ్వర్ కన్నార్పకుండా చూస్తున్నాడు. తెల్లటి పాంటు తెల్లటి శ్లాక్. వారం రోజుల క్రితం గీసుకుని వుండాల్సిన గెడ్డం. దేవానంద్ లా అతను కాలర్ కింద జేబు రుమాలు మడత పెట్టి వుంచుకున్నాడు.

"ఈసారి యే పేరుతో పిలిస్తే పలుకుతావు?" పరమేశ్వర్ నవ్వుతూ అడిగాడు.

"రాజా అనండి!" అతను నవ్వాడు.

మెడమీద అరచేతో నిమురుకుంటూ పరమేశ్వర్ టేబుల్ ముందున్న కుర్చీలో కూచున్నాడు. "సిడౌన్ రాజా!" అన్నాడు.

రాజా అతని కెదురుగా కుర్చీలో కూచుని ప్రశ్నార్ధకంగా చూశాడు. పరమేశ్వర్ సిగరెట్ వెలిగించి పాకెట్ ని అతనివైపు విసిరాడు.

"ఏమిటి సంగతి?" పరమేశ్వర్ ప్రశ్నించాడు నోట్లోంచి సిగరెట్ తీయకుండా.

రాజా సిగరెట్ ని వేళ్ళతో పట్టుకొని బొటనవేలి గోటి మీద నాలుగుసార్లు కొట్టాడు. "గృహిణి హోమ్ అప్లయన్సస్" పేర మీరు చెప్పిన విధంగా సెకండ్ హాండ్ వాన్ కొన్నాను. బ్లాకలర్ మహీంద్రా. పాతికకి తక్కువ కాదన్నాడు. పదహారువేలిచ్చాను. ఆరువేలు దాకా మనకి ఖర్చవుతుంది...." అంటూ అతను అగ్గిపుల్ల

తీసి చెవిలో జొనిపి గిరగిర తిప్పసాగేడు.

"వాన్ కండిషన్ ఎలా వుంది?"

"రెండు టైర్లు మార్చాలి. రేడియేటర్, బ్రేక్సు రిపేరు చేయాలి. గీర్ ప్లేట్ కూడా మార్చాలి...."

"ఓకే. అన్నీ మరమ్మత్తులూ చేయించి ఎల్లుండి డెలివరీ తీసుకో. అవసరమయితే కొంచెం ఎక్కువగా పారెయ్. కిటికీలకి దళసరిగా వుండే కర్టెన్సు కట్టించు" పరమేశ్వర్ వివరంగా చెప్పాడు.

చెవిలో తిప్పుతున్న అగ్గిపుల్ల వెలికి తీసి, పరీక్షగా చూసి, గీచి, రాజు సిగరెట్ వెలిగించాడు. "యస్!" అన్నాడు. పరమేశ్వర్ జేబులోంచి నోట్ల కట్టని యివతలకి తీశాడు. కొన్ని నోట్లు లాగి రాజువైపు విసిరాడు.

"ఈ అయిదొందలూ ఖర్చులకి వుంచుకో. పదో తేదీ రాత్రి సరిగ్గా పదిగంటలకి ఇక్కడ నన్ను కల్సుకో. ఈ అయిదురోజులూ చిల్లర దొంగతనాలు చేయొద్దు నీమీద పోలీసుల దృష్టి పడ్డం ప్రమాదం! నీ రూపంలో కొద్ది మార్పులు రావాలి...."

"యస్ బాస్!" నోట్లు జేబులో పడేసుకుంటూ ముసిముసిగా నవ్వాడు.

"చెప్పిందంతా చెయ్. నౌ యూ కెన్ గో!" అన్నాడు పరమేశ్వర్. రాజు లేచాడు. సెల్యూట్ చేసి వెళ్ళిపోయాడు. అతని వెనకే తలుపు మూసుకుంది.

పరమేశ్వర్ కాలుతోన్న సిగరెట్‌ను జాగ్రత్తగా ఇవతలికి తీసి, పొడుగ్గా తయారైన బూడిదను సంతృప్తికరంగా పరిశీలించి యాష్‌ట్రేలో పడేశాడు.

తలుపుమీద చప్పుడు. పరమేశ్వర్ టైం చూశాడు.

పదీ పదిహేను. "కమిన్!" అతని కంఠం గంభీరంగా ధ్వనించింది.

శబ్దం చేయకుండా తలుపు ముందు ప్రత్యక్షమయిన పొట్టిగా లావుగా వున్న వ్యక్తిని అతను చిరునవ్వుతో చూశాడు నీలంరంగు పాంటూ, లేత నీలంరంగు పొడుగు చేతుల చొక్కాలో బిగించి కట్టిన వస్తాలా వున్నాడతను. బోర్లించిన కుండలా పైకి ఉబికిన పొట్టిచొక్కా గుండీలని యే క్షణంలో అయినా తెంచేసేలా వుంది. బాగా తోమిన రాగిచెంబులా మెరుస్తున్న బట్టతలమీద చెమట పూసల్లా మెరుస్తోంది.

"నమస్తే!" అన్నాడతను బొంగురు కంఠంతో. అమాయకంగా కనిపిస్తున్న అతని గుండ్రటి మొహంమీద చిరునవ్వు నాట్యం చేస్తోంది. కళ్ళ కొసల్లో యేర్పడిన గీతలు కాకి కాళ్ళ గురుల్లా వున్నాయి.

"మళ్ళీ కొత్త అవతారం ఎత్తావా?" పరమేశ్వర్ నవ్వుతూ అడిగాడు.

అతను నవ్వాడు. "ఈ వారంలో ఆ అవసరం రాలేదు!"

"రైట్! సిడౌన్ భద్రం!"

భద్రం బట్టతలమీదున్న చెమటని అరచేత్తో జాగ్రత్తగా తుడిచి, అరిచేతిని పాంటు వెనక భాగానికి రుద్దుకుంటూ కుర్చీలో కూచున్నాడు. అతని దేగకళ్ళు పరమేశ్వర్ని సూటిగా చూస్తున్నాయి.

"చెప్పు!" పెదవుల మధ్య ఇరికించిన సిగరెట్‌ని లైటర్‌తో వెలిగించి, పరమేశ్వర్ అన్నాడు.

భద్రం చిన్నగా దగ్గాడు. "నాలుగు రోజులుగా కాళ్ళ నొప్పులు పుట్టేలా గుట్టలూ పుట్టలూ పట్టుకుంటూ

తిరిగాను. మీరు చెప్పిన లక్షణాలున్న ప్రదేశం మన ప్రాంతాల్లో నొకక దేమో అనిపించింది...."

పరమేశ్వర్ కళ్ళు చిట్లించాడు. "ఉపోద్ఘాతం వద్దు. సంగతి చెప్పు!"

భద్రం నవ్వడానికి ప్రయత్నించాడు "చివరకి ఇవాళ పొద్దుట, చాలా కాలంగా మనిషి అడుగు పెట్టని ఓ ప్రదేశాన్ని కనిపెట్టాను. మాటి రోడ్డు నుంచీ దాదాపు అర కిలోమీటర్ నడిచాక, కొంత క్రిందిభాగం చేరుకుంటాం, అక్కణ్ణుంచి చెట్లకిందా, పొదల కిందా పాకుతూ వెళ్ళాలి. ముప్పాతిక ఎత్తుకి ఎక్కాక ఆ గుహని చేరుకుంటాం. ముందున్న చెట్లకి అల్లుకున్న తీగలు గుహాకి గోడలా అడ్డున్నాయి. ద్వారం ఇరుగ్గా వుంది. లోపల చిన్న చిన్న గదుల్లా మూడు అరలున్నాయి. లోపల కటిక చీకటి "

"వెరీనైస్. మనకి అన్నివిధాలా వుపయోగపడే మందిరం కనిపెట్టావ్! మెయిన్ రోడ్డు నుంచీ యెంత దూరం?" పరమేశ్వర్ అడ్డొస్తూ అడిగాడు.

"ఖచ్చితంగా చెప్పడం కష్టం. అక్కణ్ణుంచీ తిరిగొస్తూ నడిచి మెయిన్ రోడ్ చేరటానికి గంట పైగా పట్టింది."

పరమేశ్వర్ నోట్లోంచి సిగరెట్ ని తీసి యాష్ ట్రేలో పడేసి కళ్ళు పూర్తిగా తెరిచాడు. "భద్రం, నీకు అడివి మనుషులెవరూ తగల్లేదుగా?"

భద్రం ఆశ్చర్యంగా చూశాడు. "అడవి మనుషులా?"

"ఫారెస్టు డిపార్టుమెంటు వాళ్ళు...." పరమేశ్వర్ నవ్వుతూ అన్నాడు.

భద్రం పకపకా నవ్వాడు. "వాళ్ళు అంత లోపలి కంటా వెళ్ళరు. ఎవరేనా వెళ్తే, దారితప్పి తిరిగివచ్చేప్పుడు మామూళ్ళ వసూలు చేసుకుంటారు!"

"ఎవరూ నిన్ను మాళ్ళేదంటావా?" పరమేశ్వర్ అనుమానంతో ప్రశ్నించాడు.

"అడివి మనుషులే కాదు, యే మనుషులూ నా కంట పళ్ళేరు!" భద్రం సగర్వంగా అన్నాడు.

పరమేశ్వర్ మెప్పుగా తల ఆడించాడు. "భద్రం, మనం సులభంగా పైకి చేరుకోడానికి ఆ ముళ్ళకంపల మధ్య దారి యేర్పాటు చేయాలి...."

"నేను వెళ్ళడం కోసం ఈ చేతుల్తో కంపల్ని, తీగల్ని తెంచిపారేసూ ఓ మోసురుగా దారి చేశాను. అది చాల దనుకుంటే కొడవాలీ, గొడ్డలీ వగైరా పట్టుకెళ్ళాలి" భద్రం అన్నాడు.

"ఆయుధాలు అక్కర్లేదు. అవి ఆనవాలు చూపిపాయి. అవసరాన్నిబట్టి నువ్వు ముందు నడనూ నీ చేతుల్ని మరోసారి ఉపయోగించుకోవచ్చు!" పరమేశ్వర్ నవ్వుతూ అన్నాడు.

భద్రం గీరుకుపోయిన తన ముంజేతుల్ని ఒకసారి సగర్వంగా చూసుకున్నాడు. "ఓ.కే బాస్!"

పరమేశ్వర్ జేబులోంచి నోట్లకట్ట తీసి భద్రంవైపు విసిరాడు. భద్రం మొహం వెడల్పుగా అయింది.

"ఈ పెకంలో అయిదొందలు నువ్వు తీసుకో. మళ్ళీ నేను సిగ్నల్ యిచ్చేదాకా జేబులు కొట్టడం మానేయి. మన పిక్నిక్ స్పాట్ నువ్వు చూశావు. అక్కడ మూడు నాలుగు రోజులుండటానికి అవసరమయిన సరంజామా అంతా కొని రెడీగా వుంచు. రెండు పెట్రోమాక్స్

లైట్లూ, స్టవ్వూ, కిరోసిన్, హోల్డాల్సూ, దుప్పట్లూ, ఎయిర్ పిల్లోవ్ దగ్గరా అన్నీ నీ గదిలో పెట్టు. పదో తారీఖు రాత్రి సరిగ్గా పది గంటలకి కల్సుకో" అన్నాడు పరమేశ్వర్.

నోట్లకట్టని పాంటు జేబులో దోపుకుంటూ భద్రం నిలబడ్డాడు. చిరునవ్వుతో పరమేశ్వర్ ని చూశాడు.

"ఏదైనా అడగాలా?" పరమేశ్వర్ ప్రశ్నించాడు.

"అడిగే అవసరం లేకుండానే, అవసరమైతే మీకే చెప్తాను!" భద్రం నవ్వుతూ అన్నాడు.

పరమేశ్వర్ తృప్తికరంగా నవ్వాడు. "యూ ఆర్ రైట్. భద్రం పదో తారీఖు వచ్చేలోగా చెవుల్ని కప్పేలా జుట్టు యేర్పాటు చేసుకో. బుగ్గమీసాలు తగిలించుకో. ఈసారి నువ్వు కనిపించేసరికి నేనే నిన్ను గుర్తుపట్టకూడదు!"

భద్రం ధారాళంగా నవ్వుతూ నమస్తే చెప్పి వెళ్ళిపోయాడు.

పరమేశ్వర్ మూసిన తలుపుల్ని చూస్తూ ఆలోచనల్లో మునిగిపోయాడు.

నిమిషాలు గడుస్తున్నాయి.

మూడోసారి తలుపుమీద చప్పుడైంది,

పరమేశ్వర్ టైం చూసుకున్నాడు. పదిముప్పై. అందరూ చెప్పిన టైమ్ కి ఠంచన్ గా వస్తున్నారు. తన ప్లానుకి ఆ పంక్చువాలిటీ అత్యవసరం....

"కమిన్!"

తలుపు తోసుకుని ముప్పైయేళ్ళ యువకుడు గదిలో ప్రవేశించాడు. అతను ధరించిన నీలంరంగు జీన్స్ బాగా నలిగిపోయి వున్నాయి. టర్టిల్ నెక్ బనియన్ టైట్ గా

అతనికి అతుక్కుపోయి అతని కండరాల్ని బయటికి చూపుతోంది. ఛాతీమీద 'ఎంబ్రేస్ మీ' అన్న ఇంగ్లీషు అక్షరాలు ఎర్రరంగులో ప్రింట్ చేయబడ్డాయి. అతను మెల్లగా లోపలికి అడుగులు వేశాడు.

"సిడౌన్ కమల్!" పరమేశ్వర్ ఆహ్వానించాడు.

సన్నగా పొడుగ్గా వున్న కమల్ కూచోలేదు. పెద వుల్ని కప్పేస్తూ కిందికి వాలిన గుబురు మీసాలు గొంగళి పురుగుల్లా కదిలాయి. పొగచూరిన పళ్ళు కొద్దిగా పరమే శ్వర్ కి అవుపించాయి. కమల్ రెండు చేతుల్తో తన ఛాతీ మీదున్న 'ఎంబ్రేస్ మీ' అన్న అక్షరాల్ని కౌగలించు కున్నాడు. వినాయకుడి కళ్ళతో పరమేశ్వర్ ని చూశాడు.

"నుంచోవడం నా కిష్టం" కమల్ కష్టంగా అన్నాడు చేతుల్ని కిందికి వదుల్తూ.

పరమేశ్వర్ నవ్వుతూ చూశాడు. కమల్ చేతులు పిడికిళ్ళుగా బిగుసుకుంటూ తెరుచుకుంటూ వ్యాయామం చేస్తున్నాయి. వేళ్ళ వ్యాయామం!

"కమల్...." పరమేశ్వర్ ప్రారంభించాడు.

"డాక్టర్ కమల్!" కమల్ చిరునవ్వుతో సరి దిద్దాడు. పరమేశ్వర్ సూటిగా చూశాడు.

"గొర్రె గోత్రం గొల్లవారికి చెప్పక్కర్లేదు. లోకం, ప్రభుత్వం నిన్ను డాక్టర్ గా గుర్తించకపోయినా నిన్ను నువ్వు డాక్టరుగా చిత్రించుకుంటున్నావు. నేను నీకు అప్పగించే పని దృష్ట్యా, తాత్కాలికంగా నిన్ను డాక్టరుగా ట్రీట్ చేస్తాను. పైగా నీ పేరు అందరికీ తెలియడం ప్రమాదం. అంచేత నిన్ను 'డాక్టర్' అని పిలుస్తాను...."

"థాంక్స్.... ఐ లైకిట్!" కమల్ అడ్డొస్తూ

అన్నాడు.

పరమేశ్వర్ విసుగ్గా చెయ్యెత్తి అతన్ని వారించాడు. "పదో తేదీ నుండీ నాలుగైదు రోజులు నువ్వు నాతో నా కంట్రోల్లో వుండిపోవాలి. కేన్ యూ డూ దట్?"

కమల్ కళ్ళు చిట్లించాడు. వినాయకుడి కళ్ళు అతని రెప్పలకింద దాక్కున్నాయి. "ఈ మాట అడగటానికి ఈ వేళప్పుడు నన్ను డిస్టర్బ్ చేశారా? మొన్న నన్ను కల్సుకున్నప్పుడే అడిగి వుండొచ్చు...." అతని కంఠంలో ఆక్షేపణ ధ్వనించింది.

పరమేశ్వర్ సగం మూసిన కళ్ళతో, సిగరెట్ పొగ లోంచీ తీక్షణంగా చూశాడు. సిగరెట్ పైకీ కిందికీ ఆడింది. "ఏది ఎప్పుడు చెప్పాలో నేను డిసైడ్ చేస్తాను. సమాధానం చెప్పు!"

కమల్ భుజాలు ఎగరేశాడు. "ఆదాయం లేకుంటే నేను గాలి కూడా పీల్చుకోను!"

పరమేశ్వర్ నవ్వాడు. సిగరెట్ కదిలింది. "కాడి మోసిన ఎద్దుకి గడ్డి లభిస్తుంది!"

కమల్ చిన్నగా నవ్వాడు. పాలీదు కాళ్ళలా అతని చేతివేళ్ళు కదులుతున్నాయి. "నా ఫీజు నాకు వస్తుంటే నాలుగైదు రోజులేం ఖర్మ? ఇల్లరికం అల్లుడిలా పర్మనెంటుగా వుండిపోతాను!"

పరమేశ్వర్ సిగరెట్ని యాష్ట్రేలో పడేసి, కళ్ళు పూర్తిగా తెరిచి కమల్ని నవ్వుతూ చూశాడు. "కమల్! ఐ మీన్ డాక్టర్, ఇప్పట్లాగే నువ్వు చట్టవిరుద్ధంగా నీ ప్రాక్టీస్ కొనసాగిస్తే జైలు నిన్ను ఇల్లరికం అల్లుడిగా వుంచుకుంటుంది! నాతో వారం రోజులుంటే మరో

పదేళ్ళు నీ డర్టీ ప్రాక్టీసు మానేసి కూచోవచ్చు...."

కమల్ వేళ్ళు కదలడం మానేశాయి. అతని మొహం బిగుసుకుపోయింది.

పరమేశ్వర్ అతన్ని ఎగతాళిగా చూశాడు. "మెడిసిన్ చదివేప్పుడు నీ తెలివితేటలు తప్పుదారి పట్టాయి. అన్ని దుర్వ్యసనాలకీ నువ్వు బానిసయ్యావు దుష్ప్రవర్తన కారణంగా నువ్వు కాలేజీలోంచి బైటికి గెంటబడ్డావు. తల్లిలేని నిన్ను పెంచిన మీ నాన్నని నీ ప్రవర్తన పరోక్షంగా చంపేసింది. అరవైయేళ్ళలో ఆయన సంపాదించిందంతా ఆర్నెల్లు కూడా నీ ధాటికి తట్టుకోలేక పోయింది. "డిగ్రీ సంపాయించలేక పోయినా డబ్బు సంపాయించాలి. నిన్నొక యం.బి.బి యస్. డాక్టరుగా చిత్రించుకుంటూ బోర్డు కట్టి నాలుగైదు చిన్న చిన్న టౌన్‌లలో ప్రాక్టీసు పెట్టావు. ఎక్కడా రాణించలేక చివరికి ఇక్కడ స్లమ్ యేరియాలో, మానులేని దేశంలో, ప్రాక్టీసు ప్రారంభించావ్!

"ఆ ప్రాంతంలో పొట్టకూటి కోసం వొళ్ళమ్ముకునే వాళ్ళకి వైద్యం లాంటిది చేస్తున్నావు. వాళ్ళకి అబార్షన్లు చేస్తూ. పెన్సిలిన్‌తో సుఖరోగాల్ని లొంగదీసే ప్రయత్నం చేస్తున్నావు. డబ్బు సంగతేమిటో గానీ, అక్కడ సుఖరోగాల్ని సులువుగా సంపాదిస్తున్నావని నాకు తెలుసు!" పరమేశ్వర్ ముగించి పకపకా నవ్వాడు.

తన గురించి పరమేశ్వర్ చెప్పిందంతా యదార్థమే! క్వినైన్‌లా చేదుగావున్న పరమేశ్వర్ మాటల్ని విన్నాక కమల్ బెట్టు కొద్దిగా తగ్గింది.

"ఆల్ రైట్ నా గురించి మీకంతా తెలుసని ఒప్పుకుంటాను. మీతో వుండి నేనేం చేయాలి?" కమల్ తెప్ప

రిల్లీ ప్రశ్నించాడు.

పరమేశ్వర్ ముహంమీద నవ్వు మాయమయింది. "డాక్, నాతో వ్యవహారించేప్పుడు నువ్వు నేర్చుకోవాల్సిన మొదటి పాఠం ప్రశ్నలు అడక్కుండా వుండటం! నా ముందున్నప్పుడు నువ్వు ఉపయోగించాల్సింద నీ చెవుల్ని, నోటినికాదు! నువ్వు అడిగే అవసరం లేకుండా నే నీకు తెలియాల్సిన విషయాలు తెలియజేయబడతాయి. నాలుగులోజులు నేను చెప్పినట్టు విని, పదేళ్ళ పాటు కాళ్ళమీద కాళ్ళేసుకుని బతకాలని వుంటే చెప్పు!"

"కాలుమీద కాలేసుకుని జీవితాంతం బతకాలనుంది నాకు!" కమల్ నవ్వాడు.

"గుడ్...." అంటూ పరమేశ్వర్ జేబులోంచీ ఒక చీటీని తీసి కమల్ ముందు టేబుల్ మీద పడేశాడు. దాన్ని అందుకుని కమల్ పరిశీలనగా చూశాడు. ఆశ్చర్యంతో అతని పేనుగుకళ్ళు కొంచెం పెద్దగా అయ్యాయి. అతని కుడిచేతి వేళ్ళు ఎండ్రకాయ కాళ్ళల్లా మెలికలు తిరుగుతున్నాయి.

"....ఇవన్నీ సర్జికల్ ఇన్స్ట్రుమెంట్స్!" అన్నాడతను ఆశ్చర్యంతో.

"నాకు తెలుసు. వాటిని కొంటాని కెంతవుతుంది?" పరమేశ్వర్ ప్రశ్నించాడు.

కమల్ లిస్టుని మరోసారి చూశాడు. "వెయ్యి దాటొచ్చు."

పరమేశ్వర్ నవ్వాడు. "వాటిని కొండానికి ఏడు వందలు దాటదని నాకు తెలుసు!" అంటూ ఒక నోట్ల కట్టని బల్లమీద గిరాటేశాడు. "వెయ్యి రూపాయలు. అవన్నీ కొని, తతిమాది నువ్వుంచుకో. పదో తేదీ రాత్రి

సరిగ్గా పదిగంటలకి నన్నిక్కడ కల్సుకో. ఈలోగా ప్రమాదకరమయిన కేసులేవీ టేకప్ చేయొద్దు!" అన్నాడు నవ్వుతూ.

కమల్ కుడిచేతి వేళ్ళు పురుగుని పట్టుకుంటున్న కీటకం కాళ్ళలా నోట్లకట్టని చుట్టేశాయి. చీటీనీ, నోట్లకట్టనీ భద్రంగా జేబులో దాచుకుని, కమల్ ముందుకి జరిగి కుర్చీలో కూచున్నాడు. పరమేశ్వర్‌ని నవ్వుతూ చూశాడు.

"ఆ ఇన్‌స్ట్రుమెంట్స్ దేనికి?"

పరమేశ్వర్ తీక్షణంగా చూశాడు. "మొదటి పాఠం మరిచిపోయావ్! ప్రశ్నలు వద్దు!" అన్నాడతను కఠినంగా.

"సారీ .... నా దగ్గర ఆ యిన్‌స్ట్రుమెంట్సన్నీ వున్నాయి. వెయ్యివ్వ నేనే వుంచుకొని వాటిని పట్టుకొస్తాను...."

పరమేశ్వర్ కమల్ కళ్ళల్లోకి సూటిగా చూశాడు. "చెప్పింది చెయ్యడం నేర్చుకో. ఇది రెండో పాఠం! తుప్పుపట్టిన నీ పరికరాలు నా పనికి పనికిరావు. కొత్తవి కొని, బిల్లు పట్రా. నా యూ కెన్ గో!"

కమల్ లేవలేదు. "ఐ డోంట్ లైక్ వేస్టింగ్ మనీ!" అన్నాడతను పొగ ఊదుతూ.

పరమేశ్వర్ పకపకా నవ్వాడు. "నేను సేకరించిన సమాచారం ప్రకారం డబ్బు వేస్టు చేయడమే నీ వృత్తి! చెప్పింది చెయ్. జేబులు నింపుకో!"

కమల్ నవ్వుతూ లేచాడు. "ఓ.కే.... వెళ్తా...."

"మరో సంగతి. నీ రూపం పూర్తిగా మారిపోవాలి. మీసాలు తీసేయ్. భుజాలదాకా జూలు యేర్పాటు

చేసుకో. వెళ్ళి, రూపం మార్చుకుని పదో తారీఖు రా. వెయ్యి రూపాయల కోసం కక్కుర్తిపడి యెక్కడికీ ఉడాయించకు. నిన్ను వెతికి పట్టి రూపాయకో బొట్టు చొప్పున వెయ్యి రక్తంబొట్లు నీ ముక్కులోంచి పిండుతాను!" పరమేశ్వర్ నవ్వుతూ అన్నాడు. కానీ అతని కళ్ళు నవ్వటంలేదనీ కత్తికోనల్లా కఠినంగా మెరుస్తున్నాయనీ కమల్ గమనించాడు.

"విందుభోజనం తినబోతూ, సూప్ తాగేసి పరుగెట్టే మూర్ఖుణ్ని కాను. నేను!" అంటూ కమల్ గబగబా గదిలోంచి వెళ్ళిపోయాడు. పరమేశ్వర్ తనలో నవ్వుకుంటూ సిగరెట్ అందుకున్నాడు....

2

ఎదురుగా గోడకి వేళ్ళాడుతోన్న హిపోక్రేట్స్ సూక్తులి ఆకోసారి చదివి, కౌండిన్య వాచీ చూసుకున్నాడు.

శిరీషని డాక్టరు లోపలికి తీసుకెళ్ళి పదిహేను నిమిషాలు దాటింది. మరో పది నిమిషాల్లో తను రికార్డింగ్ కి వెళ్ళాలి....

కర్టెన్ని తొలగించుకుని మెల్లిగా వస్తున్న శిరీషని చూస్తూ అతను తేలిగ్గా నిట్టూర్చాడు. కొద్దిగా చెదిరిన ముంగురుల్ని సరిచేసుకుంటూ ఆమె భర్తని చిరునవ్వుతో చూస్తూ అతనిపక్కనే కూచుంది. కౌండిన్య ఆప్యాయంగా ఆమె చేతిని నొక్కాడు.

లావుగా పొట్టిగా వున్న డాక్టర్ సుబ్బలక్ష్మి టవల్ తో చేతులు తుడుచుకుంటూ తన కుర్చీలో కూచుని నవ్వుతూ చూసింది.

"మిస్టర్ కౌండిన్యా, శిరీష కండిషన్ తృప్తికరంగా

వుంది. కొద్దిగా బి.పి. వుంది. క్రమంగా కంట్రోలవు తుంది...."

"ఈసారి మళ్ళీ మిస్ కారేజ్ అయ్యే ప్రమాదం లేదుగా డాక్టర్?" అతను ప్రశ్నించాడు.

"దాదాపు లేనట్టే. గర్భంలో బేబీ పెరుగుదల నార్మల్ గా వుంది. ప్రతివారం ఇంజెక్షన్ వేసుకోవాలి. చీటికీ మాటికీ మెట్లెక్కడం దిగడం చేయకూడదు. బరువైన వస్తువుల్ని యెత్తడంలాంటి పనులు చేయకూడదు. ఇంకా తీసుకోవాల్సిన జాగ్రత్తలూ, చేయాల్సిన తేలిక పాటి ఎక్సర్ సైజూ ఆమెకి వివరంగా చెప్పాను. సాయంత్రం పూట రెగ్యులర్ గా వాకింగ్ కి తీసుకెళ్ళండి" అంది డా. సుబ్బలక్ష్మి.

"అలాగే. శిరీషని మీరు భద్రంగా చూసుకుంటున్నారు. మీ మేలు మరచిపోను!"

"మీరు కూడా జాగ్రత్తగా చూసుకోవాలి. యూనో సర్టెన్ పొజిషన్స్ ఆర్ రిస్ట్రిక్టెడ్...." డాక్టర్ చిరునవ్వులో ఆగింది.

"అఫ్ కోర్స్...." కౌండిన్య నవ్వుతూ అన్నాడు.

శిరీష బుగ్గలు ఎరుపెక్కాయి.

"ఎందుకైనా మంచిదని మీరు అనుసరించాల్సిన పద్ధతుల్ని శిరీషకి ఎక్స్ ప్లెయిన్ చేశాను" అంది డాక్టర్.

కౌండిన్య జేబులోంచి పర్సు తీశాడు. నాలుగు వంద రూపాయల నోట్లని డాక్టర్ ముందు వుంచాడు.

"రెండు చాలు...." అంది డాక్టర్.

"ప్లీజ్ డాక్టర్, తీసుకోండి. వరసగా రెండుసార్లు అబార్షనయ్యింది. పిల్లల కోసం మేం యెంత తాపత్రయ పడుతున్నామో మీకు తెలుసు. మీరిస్తున్న ట్రీట్

మెంట్ కి యెంతిచ్చినా తక్కువే అవుతుంది!" కౌండిన్య నవ్వుతూ అన్నాడు.

"మీరు—ముఖ్యంగా శిరీష నిర్భయంగా వుండాలి. జరిగిందంతా పూర్తిగా మరిచిపోవాలి. ఏమాత్రం ఆవేశ పడకూడదు, భయపడకూడదు. ఏం జరుగుతుందో అన్న కంగారు పెట్టుకోరాదు. హారర్ మూవీస్ చూపించకండి! సకాలంలో ఆమె చక్కటి బేబీని ప్రసవిస్తుంది. ఎవ్విరీథింగ్ విల్ బీ ఆల్ రైట్!" అంది డాక్టర్ నోట్లని కళ్ల సారంలోకి తోస్తూ.

కౌండిన్య లేచాడు. శిరీష నిలబడి డాక్టర్ కి నమస్కరించింది. డాక్టర్ కౌండిన్యవైపు నవ్వుతూ చూసింది.

"రాత్రి మీ కొత్త పాట విన్నాను. స్త్రీ హృదయం గురించి స్త్రీ కన్నా కవికే బాగా తెలుసనిపించింది ఆ పాట వింటూంటే. ఆ పాటతో మీరు హిందీ సినీ కవులు సాహిర్ శైలేంద్రల స్థాయికి దాదాపుగా చేరుకున్నారు! కంగ్రాట్స్!"

"అయామ్ ఫ్లాటర్డ్. థాంక్స్ డాక్టర్!" అన్నాడు కౌండిన్య.

కౌండిన్యకు శిరీషను చూస్తూ చేంటే గర్వంగా వుంది.

అదృష్టం కొద్దీ తను చిత్రసీమలో ప్రవేశించాడు. రచయితగా తన మొట్టమొదటి చిత్రమే నటిగా ఆమెకి మొదటి చిత్రం! తను చిత్రించి, ఆమె నటించిన హీరోయిన్ పాత్ర నిజంగానే శిరీషని కదిలించివేసింది. తను రాసిన ప్రతి అక్షరాన్నీ ఆమె అనుభవించి. పలికింది. తన సృష్టి ఆమెలోని నటికి ప్రాణం పోసిందనుకున్న శిరీష తనని — ఆరాధించసాగింది. తన అక్షరాలకి ఆమె కంఠం

ప్రాణం పోసిందని తను అనుకున్నాడు.

ఒక సినిమాతోనే శిరీష అలసిపోయింది. సినిమా లోకం ఆమె ఊహించుకున్న స్వప్న ప్రపంచం కాదు. సెట్స్‌మీద, కెమెరా ముందే కాకుండా ఇరవై నాలుగంటలూ నటిస్తూ వుంటేగానీ తను తారాపథం చేరుకోలేదని ఆమె అచిరకాలంలో గ్రహించింది. ఒక్క చిత్రంతోనే నటనకి స్వస్తి చెప్పింది. తనకి దగ్గరైంది. తను ఆమెకి దూరం కాలేకపోయాడు. పరిశ్రమలోని అందర్నీ ఆశ్చర్యపరుస్తూ ఇద్దరూ భార్యాభర్తలయ్యారు....

3

పదో తారీఖు రాత్రి పది గంటలు.

తన ముందు కూచున్న ముగ్గుర్నీ పరమేశ్వర్ చిరునవ్వుతో చూశాడు. అతని నోట్లో యిప్పుడు సిగరెట్ లేదు. కళ్ళు పూర్తిగా తెరిచివున్నాయి.

"మీరు ఒకరికొకరు అపరిచితులు. ఈ క్షణం నుంచీ ఒక చేతివున్న వేళ్ళలా మనం కలిసి పని చేయాలి. రాజు, భద్రం, కమల్.... డాక్టర్ కమల్...." ముగ్గుర్నీ ముగ్గురికీ పరిచయం చేశాడు పరమేశ్వర్.

ముగ్గురూ తలలు ఆడిస్తూ చిరునవ్వుతో చూసుకున్నారు. కమల్ ఆపకుండా చేతివేళ్ళతో వ్యాయామం చేస్తున్నాడు.

"రాజూ?" పరమేశ్వర్ సాభిప్రాయంగా అన్నాడు.

"అంతా రెడీ బాస్. వాన్‌కి మీరు చెప్పిన యేర్పాట్లన్నీ చేశాను. రథం ఏ క్షణంలో అయినా కదుల్తుంది;" రాజు సగర్వంగా అన్నాడు.

"వెరీగుడ్...." అంటూ పరమేశ్వర్ ఒక నోట్లకట్టని

అతనివైపు విసిరాడు. "ఈ డబ్బుతో మనకి నాలుగైదు రోజులకి సరిపడే ఆహారపదార్థాలు కొని వాన్‌లో స్టోర్ చెయ్. కాఫీ, టీ, బిస్కెట్స్, బ్రెడ్డూ, స్టవ్, కిరోసిన్.... ఇంకా చెప్పాలా?" ప్రశ్నించాడతను.

"అవసరంలేదు. అవసరమయినవన్నీ వుంటాయి!" రాజా నవ్వుతూ అన్నాడు.

కమల్ చిన్నగా దగ్గి పరమేశ్వర్ వైపు చూశాడు. పరమేశ్వర్ కనుబొమలు ప్రశ్నార్థకంగా కలుసుకున్నాయి.

"అసలు సంగతి మరచిపోయారు. అది లేకుండా పిక్‌నిక్ జరగదు!" అన్నాడు నవ్వుతూ.

పరమేశ్వర్ చిన్నగా నవ్వాడు. "ప్రసాదంతోపాటు తీర్థం కూడా వుంటుంది! వాట్ రాజా?"

రాజా చిరునవ్వు నవ్వాడు. "ఒక్కటి తప్ప డాక్టరుకి అన్నీ దొరుకుతాయి!" అన్నాడు కమల్ వైపు కన్నుగీటుతూ. కమల్ మీసాలు కొద్దిగా కదిలాయి అతని పళ్ళని చూపిస్తూ.

"భద్రం?" పరమేశ్వర్ భద్రంవైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"అన్నీ సిద్ధంగా వున్నాయి బాస్!" భద్రం జవాబిచ్చాడు.

"రైట్. కాన్ఫరెన్స్ పూర్తయ్యాక నువ్వూ, రాజా వాటినన్నింటినీ వాన్‌లో సర్దండి" పరమేశ్వర్ ఉత్తరువిచ్చాడు. మెల్లగా లేచి రెండుసార్లు అటూ ఇటూ తిరిగాడు. మళ్ళీ కుర్చీలో కూచున్నాడు. అనుచరుల్ని కలయజూశాడు.

"ఈ ప్రిపరేషనంతా దేనికోసమో మీకు తెలీదు. నే

నిస్తున్న డబ్బుకోసం ఇంతవరకూ నేను చెప్పినదంతా మీరు చేశారు. అసలు విషయం మీకు చెప్పేముందు, ఈ అడ్వెంచర్లో పాల్గొనడానికి మీరు సిద్ధంగా వున్నారేమో నేను తెలుసుకోవాలి....” పరమేశ్వర్ ఆగి, లేచి నిలబడి రెండు అరచేతుల్నీ ముందున్న బల్లమీద ఆన్చాడు. ముగ్గురూ అర్థం కానట్టు అతన్నే చూస్తున్నారు.

“చట్టవిరుద్ధంగా జీవించటానికి మీరు అలవాటు పడ్డారు. అందుకే మిమ్మల్ని ఎన్నుకున్నాను. చేయబోయేది చట్టవిరుద్ధమయిన పని. ప్రమాదంతో కూడుకున్న పని పట్టుబడితే శిక్ష తప్పదు! చాకచక్యంగా పని సాధిస్తే కొన్నేళ్ళపాటు మీరు రాజుల్లా బతికొచ్చు. ఆ గ్యారెంటీ నేనిస్తాను!” పరమేశ్వర్ ఆగి సమాధానం చెప్పమన్నట్టు వాళ్ళవైపు చూశాడు.

రాజు కాలర్ వెనకున్న జేబురుమాలు లాగి, మడత విప్పేసి, మళ్ళీ మడతపెట్టి కాలర్ వెనుక ఇరికించాడు. భద్రం బట్టతలని అరచేత్తో తుడుచుకుని, అరచేతిని పాంటుకి రుద్దసాగేడు. వాళ్ళిద్దర్నీ గమనిస్తున్న కమల్ మీసాలు చిరునవ్వుతో కొంచెం కదిలాయి. ఒకసారి పరమేశ్వర్ని చూసి, వ్యాయామం చేస్తున్న తన వేళ్ళ మీద దృష్టిని నిలిపాడు.

“మీరు దిగమంటే లోతు చూడకుండా గోతిలో దిగేస్తాను బాస్!” రాజు అన్నాడు.

“రోజూ వాయిదాల పద్ధతిలో భయపడి చావడం కన్నా, ఒకేసారి పెద్దమొత్తం భయపడి, పెద్దమొత్తం సంపాయించి హాయిగా రిటైరై పోవడం మంచిదనుకుంటున్నాను!” భద్రం నిదానంగా అన్నాడు.

పరమేశ్వర్ చిరునవ్వు నవ్వాడు. తెలివైన నిర్ణయం!

డాక్టర్, వాటబౌట్ యూ?"

"ప్రమాదం డోసూ, పారితోషికం రేటూ తెలిస్తే గానీ నేనేమీ చెప్పలేను!" కమల్ జవాబిచ్చాడు.

పరమేశ్వర్ అతన్ని సూటిగా చూశాడు. "పట్టుబడితే పదేళ్ళు నువ్వు వేళ్ళు నలుపుకుంటూ జైల్లో కూచోవాల్సి వుంటుంది. విజయం సాధిస్తే దాదాపు యాభై వేలు నీ చేతిలో వాలుతుంది!"

కమల్ వేళ్ళు వ్యాయామం మరచిపోయి నిశ్చలంగా వుండిపోయాయి. అతని నాలుక పెదాల్ని తడిపింది. యాభై వేలు! యాభై జన్మలెత్తినా తను ఒక్కసారిగా యాభై వేల రూపాయల్ని ముట్టుకోలేడు! తవ్వితేగానీ బంగారం దొరకదు! కంచె దాటి చెట్టెక్కితేగానీ పళ్ళు అందవు! అతను నవ్వు మొహంతో పరమేశ్వర్ని చూశాడు.

"ఆల్ రైట్. మీతో బాటే నేనూ దూకుతా!" అన్నాడు క్లుప్తంగా.

పరమేశ్వర్ కొంచెం ముందుకి వంగి కమల్ మొహంలోకి తీక్షణంగా చూశాడు. "డాక్టర్, నా ప్లాను గురించి వినే క్వాలిఫికేషన్ నీకు వచ్చింది. అంతా విన్నాక మాతో చేతులు కలుపుతానంటే యూ ఆర్ వెల్కం! లేదంటే నీ మానాన నువ్వు వెళ్ళొచ్చు. అయితే జరిగిందీ, విన్నదీ పూర్తిగా నువ్వు మరచిపోవాలి. ఈ విషయం గురించి ఎక్కడా నువ్వు మాట్లాడకూడదు. అందుచేత నువ్వు ఏ దారిన వెళ్ళాలో నేను నిర్ణయిస్తాను...."

కమల్ వొళ్ళు ఒకసారి జలదరించింది. అతని కనుబొమలు రెండూ గొంగళి పురుగుల్లా కల్సుకున్నాయి.

"అంటే....?"

పరమేశ్వర్ నవ్వాడు. ఆ నవ్వులో స్నేహభావం లేదు. "నా ప్లాను గురించి విన్నాక పాలలో నీళ్ళలా నువ్వు మాతో కల్సిపోవాలి. లేకపోతే నీ నోరు యెలా మూయ్యాలో నేను నిర్ణయిస్తానని చెప్తున్నా!"

కమల్ తదేకంగా పరమేశ్వర్ని చూశాడు. "పని య్యాక నా దారిన నేను పోవచ్చా? ఐ వాంట్ టూ ఎంజాయ్ లైఫ్!"

"పనయ్యాక చేసిన పని గురించి నువ్వు దండోరా వేసుకోలేవు. దేశమంతా నువ్వు దొర్లుకుంటూ వెళ్ళొచ్చు" పరమేశ్వర్ నవ్వుతూ అన్నాడు.

"కౌంట్ మీ యిన్!" కమల్ ముక్తసరిగా అన్నాడు.

"దట్స్ గుడ్!" అంటూ పరమేశ్వర్ ముగ్గుర్నీ కలయజూశాడు. ఆరు కళ్ళు అతన్ని ఆత్రంగా చూస్తున్నాయి.

"సినీ రచయిత కౌండిన్య పేరు విన్నారా?" పరమేశ్వర్ ప్రశ్నించాడు.

"అతను రాసిన 'ఎత్తి మాసుకో' అన్న పాట నా కెంతో యిష్టం!" కమల్ నవ్వుతూ అన్నాడు.

"సినిమాకి వెళ్తాగానీ, పాటల్నీ మాటల్నీ పట్టించుకోను!" భద్రం నవ్వుతూ అన్నాడు. రాజు కిసుక్కున నవ్వాడు.

"అతను యెవరో సినీతారను పెళ్ళాడినట్టు విన్నాను" అన్నాడు రాజు.

"కరెక్ట్. ఆమె పేరు శిరీష. వాళ్ళకి పెళ్ళయి ఆరు చేళ్ళు దాటింది. శిరీషకి రెండుసార్లు అబార్షన్ అయ్యింది.

పిల్లలకోసం వాళ్ళిద్దరూ తహతహలాడుతున్నారు....” పరమేశ్వర్ చెప్పసాగేడు.

“ఆమెకి పిల్లలు కలిగేలా చేయాలా?” కమల్ అడ్డొస్తూ కొంటెగా ప్రశ్నించాడు. రాజా, భద్రం గొల్లున నవ్వారు. పరమేశ్వర్ మొహంమీద చిరునవ్వు మెరిసింది కమల్ వైపు చూశాడతను.

“నీకా శ్రమ అక్కర్లేదు. ఆమెకిప్పుడు యెనిమిదో నెల....”

కమల్ నిరుత్సాహంగా చూశాడు. “బాడ్ లక్!”

“దటీజ్ అవర్ గుడ్ లక్ డాక్టర్! అడ్డుతగలకుండా విను. తన భార్యకి ఈసారి మళ్ళీ గర్భస్రావం అవకుండా కౌండిన్య యెంతో జాగ్రత్త తీసుకుంటున్నాడు. ఫేమస్ గైనకాలజిస్టు. డాక్టర్ సుబ్బలక్ష్మి రక్షణలో ఆమె గర్భం పెంపొందుతోంది....”

“గట్టిగా తుమ్మితే తన భార్యకి గర్భస్రావం అయిపోతుందేమో అని అతను భయపడిచస్తున్నాడు. ఆమెని గాజుబొమ్మలా అతిభద్రంగా చూసుకుంటున్నాడు. ఆ గాజుబొమ్మని మనం తీసుకెళ్ళాం. నిర్ణయించిన సమయంలోగా, నిర్ణయించిన మొత్తం చెల్లించకపోతే ఆమెకి అబార్షన్ యేర్పాటు చేయబడుతుంది ”

“గుడ్ గాడ్!” కమల్ ఆశ్చర్యంతో అరిచాడు.

“నా వార్నింగ్‌ని అతను నిర్లక్ష్యం చేయడు. నేను కక్కమన్నంతా కక్కుతాడు. అతను నా షరతుల్ని నిర్లక్ష్యంచేసి మొండిగా ప్రవర్తిస్తే మన డాక్టర్ కమల్ శిరీషకి గర్భస్రావం చేస్తాడు....” పరమేశ్వర్ ఆగి, కమల్‌ని చూశాడు.

ఎప్పుడో కదలడం మానేసిన తన వేళ్ళని కమల్

అర్థంకానట్టు చూసుకున్నాడు. "గర్భాలు చేయడం సులభమే కాని .... నిజం చెప్పాలంటే ఒకటి రెండు నెలల గర్భాన్ని నేను తీసిపారేశాను. ఇంత ఎడ్వాన్స్డ్ ప్రెగ్నెన్సీని ఇంతవరకూ నేను టెర్మినేట్ చేయలేదు...." కమల్ నీళ్ళు నమిలాడు.

"చేయగలవా? చేయలేవా?" పరమేశ్వర్ తీక్షణంగా ప్రశ్నించాడు.

"ప్రతి పనికీ యెప్పుడో అప్పుడు ప్రారంభం జరగాలి. ఇది కొంచెం కష్టమైన పని. ఓ కే.... చేస్తాను. నాకో సందేహం. అడిగింది ఇవ్వకపోతే అబార్షన్ జరిపిస్తాం. కసితీరడం తప్ప మనకి యేమిటొస్తుంది?" కమల్ అడిగాడు.

"అబార్షన్ మొదటి విడత పనిష్మెంట్! అప్పటికీ అతను లొంగకపోతే తన గర్భం నశించినట్టు ఆమె కూడా నశిస్తుంది. అయినా కౌండిన్య అందాకా రానియ్యడు. అర్థంపర్థంలేని పాటలుగీకి అతను శుభ్రంగా ఆర్జిస్తున్నాడు. తన భార్య గర్భంలోని శిశువు మీద వున్న ప్రేమకి వెయ్యింతలు ప్రేమ అతనికి భార్యమీద వుంది. నాకు తెలుసు; మనం పాడే పాటకి అనుగుణంగా, మనం ఆడమన్నట్టు అతను ఆడతాడు. మనం ఉత్తుత్తి బెదిరింపులు చేయటంలేదని నిరూపించడానికి అవసరమైతే, గర్భస్రావం చేసి, ఆ పిండాన్ని ఆమె కట్టుకున్న చీరలో పార్సెల్ చేసి అతనికి కానుకగా అందిస్తాం!" పరమేశ్వర్ నవ్వుతూ అన్నాడు.

ముగ్గురూ అతన్ని ఒకవిధమైన భయంతో చూశారు. చదువు, సంస్కారం వున్న మనిషిలా నవ్వుతూ కనిపించే పరమేశ్వర్ బుర్రలోంచి ఇవతలికి వచ్చిన భయం

కరమైన ఆలోచన వాళ్ళలో అతనిపట్ల ఒకరకమైన గౌరవాన్ని, భయాన్ని పుట్టించాయి. రాజు చిన్నగా దగ్గాడు.

"బాస్, ఎన్నో రకాలైన బ్లాక్ మెయిల్స్ గురించి నేను విన్నాను. మీ ప్లాను గురించి వింటూంటే, భయం కలిగించేదిగా వుంది...."

పరమేశ్వర్ పకపక నవ్వాడు. "మన ప్లాను మనకి భయంకరం కాదు! అది కౌండిన్యకి అమానుషంగా, భయానకంగా అవుపించాలి. అప్పుడే అతను అడిగినంతా అందిస్తాడు!"

"కరెక్టు!" భద్రం ఉద్రేకంతో అన్నాడు. పరమేశ్వర్ తృప్తికరంగా తలపంకించాడు.

"ఓకే ఇదంతా ప్లానులో రెండో ఘట్టం, మొదటి ఘట్టం గురించి జాగ్రత్తగా వినండి: ప్రతిరోజూ సాయంత్రం శిరీష గాంధీ రోడ్డు. నెహ్రూ రోడ్డు క్రాసింగ్ లో వున్న చిన్న పిల్లల పార్కుకి షికారు వస్తుంది. రోజూ కొంత దూరం నడవాలని డాక్టర్ ఆమెని ఆదేశించింది. రేపు సాయంత్రం ఆమె వొంటరిగా పార్కుకి వస్తుంది. అతను రికార్డింగ్ కి వెళ్తాడు. ఈ వివరాలన్నీ నేను జాగ్రత్తగా సేకరించాను. రేపు సాయంత్రం ఆరూ, ఏడు గంటలమధ్య మనం ఆమెని కిడ్నాప్ చేయాలి...." పరమేశ్వర్ ఆగి, జేబులోంచీ ఒక ఫోటో తీసి వాళ్ళవైపు విసిరాడు.

"అది మన 'పేషెంట్' శిరీష ఫోటో. ముగ్గురూ ఆమె రూపాన్ని బాగా గుర్తుంచుకోండి!" అంటూ అతను పెదాలమధ్య సిగరెట్ ఇరికించి లైటర్ తో ముట్టించి కళ్ళు చిట్లిస్తూ చూడసాగేడు.

ఫోటోను చూస్తున్న కమల్ కళ్ళు పైకి ఉబ్బి వొచ్చాయి. ఎర్రటి నాలుక అతని పొగమూగిన పెదాల్ని తడపసాగింది. "షి యీజ్ ఏ రియల్ బ్యూటీ!" అన్నాడతను లొట్టలు వేస్తూ.

భద్రం ఫోటోని అతని చేతిలోంచి తీసుకున్నాడు. చూసి, రాజుకి అందించాడు.

"రేపు మీరు ముగ్గురు మీ వేషాలు మార్చుకోండి. ఎవరెవరు యేమేం చేయాలో చెప్తాను. జాగ్రత్తగా వినండి. పొరపాటు చేస్తే ప్లానంతా బెడిసికొడుతుంది!" అంటూ పరమేశ్వర్ కిడ్నాప్ ప్లాన్ గురించి వాళ్ళకి వివరించడం ప్రారంభించాడు.

4

కార్ని కొంచెం స్లో చేసి, రాజు రియర్ వ్యూ మిరర్ ని పరీక్షగా చూశాడు. ఏ కారు తనని వెంబడించడం లేదు.

సరిగ్గా ఆరూనలభై యేడుకి అతను చిల్డ్రన్స్ పార్కు ముందు రోడ్డు వారగా కార్ని ఆపాడు. ఇగ్నిషన్ కీని జేబులో పడేసుకున్నాడు. గ్లవ్స్ని తీసి సీటు మీద పడేశాడు.

జేబు రుమాలు పట్టుకున్న ఎడంచేతితో డోర్ తెరిచి, కిందికి దిగాడు. బూటు కాలితో డోర్ని తోశాడు. రెండు క్షణాలు నిలబడి అటూ ఇటూ చూశాడు.

కార్లూ, ఆటోలూ, సిటీ బస్సులూ అటూ ఇటూ వెళ్తున్నాయి. లోకం తనని పట్టించుకోడం లేదు!

చకచకా నడుస్తూ అతను పార్కులో ప్రవేశించాడు.

పార్కులో లైట్లు ప్రకాశవంతంగా వెలుగుతున్నాయి. రంగురంగుల దుస్తుల్లో యెంతో మంది పిల్లలు ఉషారుగా ఆడుకుంటున్నారు. తనకి పిల్లల్తో పని లేదు! రాజు

పార్కులో గడ్డిమీదా, బెంచీలమీదా కూచున్న ఆడవాళ్ళని వోరగా చూస్తూ నవుస్తున్నాడు. నిమిషాలు గడుస్తున్నాయి, అతని కళ్ళు ఆమెకోసం నిర్విరామంగా ఆత్రంగా గాలిస్తున్నాయి.

అతను పార్కుమూలకి చేరుకున్నాడు. అతని కళ్ళు మెరిశాయి.

పూల మొక్కలకి అటువైపున గడ్డినేలమీద ఆమె పచార్లు చేస్తోంది; ఒంటరిగా. కొద్దిగా ఉబ్బిన రబ్బరు బొమ్మలా వుందామె. ఊదా రంగు దుస్తుల్లో వున్న ఆమెని చూస్తోంటే రాజా కళ్ళు చెదురుతున్నాయి. రాజా ఆమెని సమీపించాడు. పచార్లు మాని, పదడుగుల దూరంలో తప్పటడుగులేస్తున్న కుర్రాణ్ని చూస్తూ నిలబడిందామె.

"అమ్మగారూ...." రాజా నెమ్మదిగా పిలిచాడు.

ఏదో ఊహాలోకంలో వున్న శిరీష ఉలిక్కిపడి, గిరుక్కున తిరిగి అతన్ని ప్రశ్నార్థకంగా చూసింది. అతను సన్నగా పొడుగ్గా వున్నాడు. ముక్కుకొనమీద కుంకుడు గింజలా నల్లటి మచ్చ వుంది. ఖాకీ యూనిఫామ్‌లో వున్నాడతను. షర్టు జేబుమీద "భారత్ మూవీస్" అన్న అక్షరాలు నీలం రంగులో మెరుస్తున్నాయి.

"అమ్మగారూ, కౌండిన్యగారు పంపించారు. తమర్ని స్టూడియోకి తీసుకురమ్మన్నారు....?"

"దేనికి?" శిరీష కళ్ళు చిట్లిస్తూ ప్రశ్నించింది.

రాజా గుటక మింగాడు. నాలుకతో పెదవుల్ని తడుపుకున్నాడు.

"కౌండిన్యగారికి కొద్దిగా సుస్తీ చేసింది.... ప్రొడ్యూసర్ భజగోవిందంగారు వెంటనే డాక్టర్ని

పిలిపించారు...."

శిరీష అప్రయత్నంగా అతన్ని సమీపించింది. ఆమె మొహంలో, కళ్ళలో కంగారు ప్రత్యక్షమవుతోంది. "ఏం జరిగింది? ఆయన ఎలా వున్నారు?" వణికే కంఠంతో అతన్ని ప్రశ్నించింది.

"మరేం కంగారుపడకండి. స్ట్రోక్ అయ్యుండొచ్చన్నారు డాక్టరుగారు. అయ్యగారు అక్కడే విశ్రాంతి తీసుకుంటున్నారు. మిమ్మల్ని తీసుకురమ్మన్నారు. తరవాత డాక్టరుగారు ఆయన్ని క్లినిక్కి తీసికెళ్తారు...."

"ఆయన....ఆయన...ఎలా వున్నారు?" శిరీష తడబడుతూ అడిగింది. భర్తపట్ల ప్రేమ ఆమె విశాల నేత్రాల్లో ఆదుర్దారూపంలో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

"కొద్దిగా నీరసంగా వున్నారు. మీరు ఇక్కడ వుంటారని ఆయనే చెప్పారు. ప్రొఫెసర్ గారి కార్లో వచ్చాను. మీరు వసే...." రాజు ఆగి, నుదుటికిపట్టిన చెమటని అరచేత్తో తుడుచుకున్నాడు. నటించడం యెందుకో అతనికి గాబరా పుట్టిస్తోంది. కానీ ఆ గాబరా తన నటనకు సహజత్వాన్నిస్తోందని అతనికి తెలుసు....

"కారెక్కడుంది?" శిరీష కదుల్తూ అడిగింది.

"గేటు ముందు....తమరు నడవగలరా?" రాజా అమాయకత్వం నటిస్తూ సానుభూతితో అడిగాడు.

తల ఆడిస్తూ శిరీష నడవసాగింది. రాజు గబగబా ముందు అడుగులేశాడు. పార్కు గేటుదాటి కొంచెం దూరంలో వున్న పెద్ద నీలంరంగు కార్ని శిరీష చూసింది.

కారు అద్దంమీద 'దేశానికి దిక్కెవరు?' సినిమా పోస్టర్లు అతికించబడి వున్నాయి. భారత్ మూవీస్ నిర్మిస్తున్న తాజా చిత్రం. కౌండిన్యకి చాలా నచ్చిన ఇతి

వృత్తం వున్న కథ, శిరీష ఆలోచిస్తూ కారువేపు అడుగులు వేసింది.

జేబురుమాలు కప్పి, హాండిల్ పట్టుకుని రాజు వెనక డోర్ తెరిచి, వినయంగా నిలబడ్డాడు. కార్లో యెక్కి కూచుని, శిరీష నీరసంగా వెనక్కి వాలింది. ఆమె మొహంమీద చెమట ముత్యాల్లా మెరుస్తోంది. రాజు డోర్ మూశాడు.

"డ్రైవర్, త్వరగా పద...." అందామె. రాజు వినయంగా తలవాల్చి గబగబా కారు ముందుకి నడిచాడు. డోర్ తెరిచి, స్టీరింగ్ వెనక సర్దుక్కూచుంటూ గ్లవ్స్‌ని కుడిచేతికి తగిలించుకున్నాడు. కారు స్టార్టయ్యింది. ముందుకు వెళ్ళి, కుడివేపుకి తిరిగింది.

"ఇలా వెళ్తున్నావ్....చుట్టు దారి కదూ?" వెనక నుంచీ శిరీష కంఠం ప్రశ్నించింది.

"అలా వెళ్ళలేం అమ్మగారూ: ఈ మధ్య ఆ రోడ్డుని వన్ వే చేశారు" రాజు తడుముకోకుండా అబద్ధమాడాడు.

శిరీష నిట్టూర్చింది. "త్వరగా పోనీ" అందామె ఆత్రుతగా.

"అయ్యగారు మిమ్మల్ని జాగ్రత్తగా తీసుకురమ్మన్నారు. స్లోగా డ్రైవ్ చేయమన్నారు. ఈ రోడ్లో కొంచెం దూరం వెళ్ళాక ట్రాఫిక్ బాగా పల్చబడుతుంది. అయిదు నిమిషాల్లో అక్కడుంటాం...." అన్నాడు రాజు.

శిరీషకి భర్తపట్ల జాలీ, ప్రేమా పొంగుకొచ్చాయి. ఎప్పుడూ తన ఆరోగ్యం గురించే కొండంత ఆపత్రయం!

కారు మామూలు వేగంతో పోతోంది. శిరీష కళ్ళు ఆత్రంగా అటూ యిటూ చూస్తున్నాయి.

"డ్రైవర్, నాకేం ఫర్వాలేదు. స్పీడుగా పోనీ! ఇంకా

యెంతదూరం?" కారు యెటు వెళ్తుందో అర్థంకాక శిరీష అడిగింది.

"వచ్చేశాం, అమ్మగారూ. ఈ రోడ్డు తిన్నగా స్టూడియో వెనకభాగంలోకి వెళ్తుంది" అంటూ రాజు మలుపు తిప్పాడు.

రెండువేపులా గుడిసెలున్న రోడ్లో కారు వెళ్ళసాగింది. కొంచెం దూరంలో మరో రోడ్డు అడ్డంగా పోతోంది. రోడ్డు వారగా తెల్లటి ప్యాంటూ, స్లాకూ వేసుకుని నిలబడ్డ వ్యక్తిని కళ్ళు చిట్లిస్తూ చూసి రాజు తేలిగ్గా నిట్టూర్చాడు. రోడ్డువార నుంచున్న వ్యక్తి కుడి చెయ్యి కొద్దిగా పైకి లేచింది. స్లో చేసి, అతని సమీపంలో కారాపాడు రాజు.

"స్టూడియోలో పనిచేసే వ్యక్తి...." అంటూ శిరీష వైపు చిరునవ్వు నవ్వాడు.

వైట్ డ్రెస్‌లో నిలబడ్డ కమల్ రెప్పపాటులో వెనకడోర్ తెరిచి, శిరీష పక్కన కూచుంటూ, తలుపు మూసేశాడు. కారు కదిలింది.

డ్రైవర్ పక్కన ముందుసీట్లో కూచోకుండా తనవైపు ఎక్కిన వ్యక్తిని ఆశ్చర్యంతో చూసింది శిరీష. అతను తనవైపు చూడ్డం లేదు. అతన్నుంచీ విస్కీ వాసన లీలగా వస్తోంది. శిరీష అప్రయత్నంగా మూలకి జరిగింది.

కమల్ చెయ్యి ప్యాంటు జేబులోంచీ యివతలికి వచ్చింది. పాము పడగలా దూసుకెళ్ళి జేబురుమాల్ని శిరీష మొహంమీద అదిమి పట్టుకుంది అతని చెయ్యి.

ఏం జరుగుతోందో ఊహించే అవకాశం లేకుండానే శిరీష తలని బలహీనంగా పక్కకి వాల్చేసింది.

కమల్ ఆమెమీదకి వాలి, ఆమెవైపున్న కిటికీ

అద్దాన్ని పైకి తేశాడు. కాసేపట్లో అతనివైపున్న అద్దం కూడా పైకి లేచింది. కారు మరో మలుపుతిరిగి జోరుగా వెళ్తోంది. జేబురుమాలు కమల్ జేబులోకి మాయ మయింది.

5

కారును పోర్టికోలో ఆపి కౌండిన్య కిందికి దిగాడు.

తను రావడం ఆలస్యమయింది. తనవాళ్ళను యెవర్నీ తోడుగా వుంచుకోడానికి శిరీష ఇష్టపడనందుకు విచారిస్తూ అతను గుమ్మం ముందు ఆగి, బజర్ నొక్కాడు.

తలుపు తెరిచిన వంటామెని ఆశ్చర్యంతో చూశాడు.

“మంగమ్మా, నువ్వింకా వెళ్ళిపోలేదేం?”

“అమ్మగారింకా రాలేదు....” అంటూ ఆమె ఆవులింతను ఆపుకుంటూ. కౌండిన్య అర్థం కానట్టు ఆమెవంక చూశాడు.

“ఎక్కడికి వెళ్ళింది?”

“అరింటికి పార్కుకెళ్ళారు. ఇంకా తిరిగిరాలేదు” మంగమ్మ మెల్లిగా అంది. అంత ఆలస్యమైనా తను యింటికి వెళ్ళలేక పోయిందన్న విచారం ఆమె కంఠంలో ధ్వనించింది.

“రోజూ ఏడింటికే తిరిగొచ్చేది. ఇవాళ యెందుకింత ఆలస్యం చేసింది?” కౌండిన్య ప్రశ్నించాడు. వంటామె ఆ ప్రశ్నకి జవాబివ్వలేదని అతనికి తెలుసు. మంగమ్మ మాట్లాడకుండా పెదవి విరిచింది.

కౌండిన్య వెనక్కి తిరిగాడు. “మంగమ్మా, పార్కుకెళ్ళి కార్లో శిరీషను తీసుకొచ్చేస్తా. మరో అయిదు నిమిషాలాగి వెళ్ళువు గానీ....” అంటూ చకచకా కారు వైపు నడిచాడు.

కారు మెల్లగా వెళ్తోంది. కౌండిన్య రోడ్డుకి రెండు వేపులా పేవ్ మెంట్స్ ని పరీక్షగా చూస్తూ ఆలోచిస్తున్నాడు. తొమ్మిది దాటుతున్నా యింటికి రాకుండా శిరీష పార్కులో యేం చేస్తోంది? ఆడుకునే పిల్లల్ని చూస్తూ కలలు కంటోందా? ఆలోచిస్తూ పార్కు ముందు కారాపి అతను దిగాడు.

పార్కు దాదాపు నిర్మానుష్యంగా వుంది సిమెంటు బెంచీలమీద నలుగురైదుగురు పడుకుని వున్నారు. మగాళ్ళు. శిరీష ఎక్కడుంది? కళ్ళుతిరిగి, సుస్తీ చేసి యే చెట్టుకిందో, బెంచిమీదో పడుకుందా? కౌండిన్య కంగారుగా అడుగులు వేయసాగాడు.

పొదలచాటునా, చెట్లకిందా, చీకటి నక్కి దాక్కున్న ప్రదేశాల్లో అతను వెతకడం ప్రారంభించాడు. తనకి తెలీకుండానే కౌండిన్య పార్కుని మూడు సార్లు ప్రదక్షిణం చేశాడు. అతనికి శిరీషమీద విసుగు పుట్టుకొస్తోంది. తను ఇప్పుడు మామూలు మనిషి కాదు. వేళకి భద్రంగా ఇల్లు చేరుకోవాల్సింది. ఆడవాళ్ళు, అందునా కడుపుతో వున్నవాళ్ళు పసిపిల్లల్లా, తిక్కగా ప్రవర్తిస్తారు. మట్టిబెడ్డలూ, చింతకాయలూ, చెత్తా చెదారం అంతా పసిపిల్లల్లా తినాలంటారు!

కౌండిన్య పార్కు మధ్యలో విగ్రహంలా నిలబడ్డాడు. ఆలోచిస్తూ, గుండ్రంగా తిరుగుతూ పార్కంతటినీ మళ్ళీ వోసారి పరిశీలించాడు. శిరీష లేని పార్కు దేవత లేని గుడిలా అనిపిస్తోందతనికి.

గేటువేపు నీరసంగా అడుగులేస్తూ అతను టైం చూసుకున్నాడు. తొమ్మిదీఇరవై. శిరీష ఈపాటికి ఇల్లు చేరుకుని వుంటుందేమో! అతను కారు స్టార్టు చేశాడు.

వెనక్కి తిప్పి ఇంటివేపు వేగంగా పోనిచ్చాడు.

“లేరా బాబుగారూ?” ఒంటరిగా కారు దిగిన కౌండిన్యను ప్రశ్నించింది వరండాలో చతికిలబడివున్న మంగమ్మ.

కౌండిన్య మెట్లకిందే నిలబడి ఆమె మొహంలోకి ఆదేశంగా చూశాడు. శిరీష ఇంటికి రాలేదని ఆమె ప్రశ్న తనకి చెప్తోంది. అతను బరువుగా మెట్లెక్కాడు. మంగమ్మ లేచి నిలబడింది.

“ఏ ఫ్రెండింటికో వెళ్ళుంటుంది. వస్తుంది. నువ్వెళ్ళు” అన్నాడతను మంగమ్మతో.

“వెళ్ళి తీసుకొస్తారా? మీరొచ్చేదాకా వుంటాను” అందామె.

కౌండిన్య ఆమెని చిరునవ్వుతో చూశాడు. “జాగ్రత్తగా ఇంటిపట్టున వుండి చక్కగా రెస్టు తీసుకొమ్మని శిరీషకి లక్షసార్లు చెప్పాను తనున్న స్థితిలో ఇలా వెళ్ళడం....” అతను ఆగి నిస్సహాయంగా మంగమ్మను చూశాడు. మంగమ్మ జాలిగా చూసింది.

“....మంగమ్మా, నువ్వెళ్ళిరా.... నేను ఫోన్ చేసి కనుక్కుంటాను” అన్నాడు కౌండిన్య.

“డైనింగ్ టేబుల్ మీద అంతా సర్దాను. అమ్మగారికి ఫ్లాస్క్‌లో వేడి పాలున్నాయి....” అంటూ మంగమ్మ మెట్లు దిగింది.

కౌండిన్య ఇంట్లో ప్రవేశించి తలుపుని సగం మూశాడు. గబగబా వెళ్ళి టెలిఫోన్ ముందు సోఫాలో కూచున్నాడు.

శిరీష ఎవరింటికి వెళ్ళివుంటుంది? తను ఈమధ్య యువ

రెంటికీ అంతగా వెళ్ళటంలేదు. పార్కులో, ఇంట్లో లేదంటే మరెక్కడికో వెళ్ళివుండాలి. కౌండిన్య కళ్ళు మూసుకున్నాడు. శిరీషకి బాగా సన్నిహితులైన ఫ్రెండ్సునీ వాళ్ళ ఫోన్ నంబర్స్‌నీ గుర్తు చేసుకోసాగేడు.

మెల్లగా కళ్ళు తెరిచి. రిసీవర్ని అందుకున్నాడు. అతని చూపుడు వేలు ఒక నంబర్ని డయల్ చేయసాగింది....

6

ఇరుకుగా వున్న గుహ అరలో డిమ్‌గా వెలుగుతోన్న పెట్రోమాక్స్ లైట్ కాంతి, స్వాభావికంగా యేర్పడ్డ రాతి గోడలమీద నీడల్ని సృష్టిస్తోంది.

కొంచెం పెరిగిన గెడ్డాన్ని తడువుకుంటూ పరమేశ్వర్ శిరీషవైపు చూశాడు. ఆమె నిశ్చలంగా వెల్లకిలా పడుకుని వుంది.

కార్లో ఆమెకి వాసన చూపిన క్లోరోఫామ్ ప్రభావం తగ్గేలోగా, దార్లో వాన్‌లోకి యెక్కించి ఆమెకి ఫార్టివిన్ ఇంజెక్షన్ ఇచ్చాడు, కమల్. సుమారుగా మరో రెండు గంటలు ఆమె నిద్రలోనే వుంటుందన్నాడతడు. ఆలోచిస్తూ పరమేశ్వర్ టైమ్ చూసుకున్నాడు.

తొమ్మిది దాటింది. కమల్ లెక్కప్రకారం మరో గంటలో ఆమె మేల్కోవచ్చు....

అరంగుళం పొడవు పెరిగిన గెడ్డం, పక్కపాపిడిని చెరిపేసి నున్నగా వెనక్కి దువ్విన క్రాపూ పరమేశ్వర్ పోలికల్ని చాలావరకు మార్చేశాయి. రహస్యంగా అతను అమర్చుకున్న కాంటాక్ట్ లెన్సెస్ అతని మారు వేషానికి పరిపూర్ణతని తెచ్చిపెట్టాయి.

బైట చప్పుడైంది. కాన్వాస్ తెరను తోసుకొని,

హోల్డాల్స్‌నీ, ఇతర పార్సెల్స్‌నీ మోసుకుంటూ సైనికుల్లా లోపలికొస్తున్న అనుచరుల్ని పరమేశ్వర్ చిరునవ్వుతో చూశాడు.

రాజా, భద్రం తమ బరువుల్ని కిందికి దించారు. భుజమ్మీదున్న హోల్డాల్ని కింద కుక్కి, కమల్ అలసటగా చూశాడు. మొహానికి పట్టిన చెమటని రెండు చేతుల్తో తుడుచుకుని, అర చేతుల్ని పాంటుకి రుద్దాడు.

“నాలాంటి వ్యక్తికి బరువులు మోసే పని వుండకూడదు. మేధావుల్ని శారీరక కష్టం చేయనివ్వడం దేశానికి నష్టం!” అన్నాడతను విసుగ్గా పరమేశ్వర్ వైపు చూస్తూ.

పరమేశ్వర్ ఎగతాళిగా నవ్వాడు, “కొంగ ఎప్పటికీ హంసకాదు డాక్!”

రాజు, భద్రం చిన్నగా నవ్వారు. కమల్ వాళ్ళని కోపంగా చూశాడు, ఇద్దరూ వస్తువుల్ని సర్దడానికి ఉపక్రమించారు.

కమల్ దృష్టి శిరీషమీద వాలింది. బరువుగా ఉచ్ఛ్వాస నిశ్వాసాలు జరుపుతున్న ఆమె ఛాతీ పైకీ కిందికీ అలలా కదులుతోంది. కోరుతూ నేలమీద పారాడే కోడిపిల్లను ఆకలిగా చూసే డేగ చూపుల్లా వున్నాయి కమల్ చూపులు.

పరమేశ్వర్ చిన్నగా దగ్గాడు. కమల్ ఉలిక్కిపడి, అతి ప్రయత్నంమీద తన చూపుల్ని పరమేశ్వర్ వైపు తిప్పాడు.

“పేషెంటు యెప్పుడు మేల్కొంటుంది, డాక్?” పరమేశ్వర్ ప్రశ్నించాడు.

“ముప్పావు గంట పట్టొచ్చు” కమల్ నిర్లక్ష్యంగా

జవాబిచ్చాడు.

"వెళ్ళి, బైట కూచుని రెస్టు తీసుకో. ఇసుకలో బండి లాగిన ఎద్దులా వొగురుస్తున్నావ్!" పరమేశ్వర్ నవ్వుతూ అన్నాడు.

"యస్. నీరసము చ్చేసింది. ఐ వాంట్ సమ్ విస్కీ" అన్నాడు కమల్.

"భద్రం, డాక్టర్‌కి అతిథిమర్యాదలు చెయ్. స్టవ్ వెలిగించి అందరికీ మేత తయారు చెయ్. కాఫీ కూడా!" పరమేశ్వర్ ఉత్తరువిచ్చాడు.

భద్రం అట్టపెట్టెలోంచీ తీసి క్వార్టర్ బాటిల్ విస్కీని కమల్‌కి అందించాడు. కమల్ ఉషారుగా గుహ ముందు భాగానికి వెళ్ళాడు. తెచ్చుకున్న రగ్గుల్నీ, హోల్డాల్స్‌నీ అక్కడా ఇక్కడా సర్దేశాడు రాజు. వెనకున్న అరలో స్టౌ వెలిగించి, వంటపనిలో భద్రం నిమగ్నమయ్యాడు.

పరమేశ్వర్ రాతికి వీపు ఆనించి బెడ్డింగ్ మీద కూచున్నాడు. జేబులోంచీ సిగరెట్ తీసి వెలిగించాడు. సగం మూసుకున్న అతని కళ్ళు నిస్సహాయంగా పడుకున్న శరీరం మీదే వున్నాయి.

రాజు అతని ముందు నిలబడ్డాడు. నున్నగా గీసుకున్న గెడ్డం. హిట్లర్ మీసాలు. ముక్కు కొనమీద కుంకుడుగింజ సైజులో నల్లటి మచ్చ, పులిపిరికాయలా కనిపిస్తోంది. మామూలుగా శుభ్రంగా దువ్వబడి వుండే రాజు క్రాపు చిందరవందరగా వుంది. చిన్న చిన్న మార్పులు అతని రూపాన్ని మార్చేశాయి...

"బాస్...." రాజు పిలిచాడు. తపస్సులోంచి మేలుకున్న వ్యక్తిలా పరమేశ్వర్ అర్ధనిమీలిత నేత్రాల్తో

అతన్ని ప్రశ్నార్థకంగా చూశాడు.

"బాస్....యిప్పుడేం చేయాలి మనం? యింతవరకూ అంతా అనుకున్నట్టు జరిగింది...."

పరమేశ్వర్ సగర్వంగా నవ్వాడు. "పని పూర్తయ్యేదాకా అంతా మనం అనుకున్నట్టే జరుగుతుంది, రాజూ! పేషెంట్ మేలుకోగానే ఆమె భర్తకి అందజేసే చిన్న సందేశాన్ని టేప్ చేస్తాను. ఆ సందేశాన్ని నేనే ఆమెకి డిక్టేట్ చేస్తాను. ఆమె కంఠస్వరం, ఆమె సందేశం మనం చేసిందీ, చెప్పేదీ, చేయబోయేదీ నిజమే అని అతనికి నమ్మకం కలిగిస్తాయి!"

"ఆమె చెప్తుందంటారా?" అడిగాడు రాజు.

"ఆమె యిప్పుడు అడక్కర్లేదు లేదు రాజూ!" పరమేశ్వర్ క్లుప్తంగా అన్నాడు.

రాజు తృప్తిగా తల పంకిస్తూ సిగరెట్ వెలిగించాడు.

"రాజూ! ఆ బాగ్‌లోంచి టేప్‌రికార్డర్ తియ్యి. ఆమె లేచేసరికి అంతా సిద్ధంగా వుండాలి. అవతల కౌండిన్య భార్య యెక్కడి కెళ్ళిందో తెలీక కాలు కాలిన పిల్లిలా తిరుగుతూ వుంటాడు పాపం!" అన్నాడు పరమేశ్వర్. భద్రం కాఫీకప్పుల్తో వాళ్ళ దగ్గరగా వచ్చాడు.

పరమేశ్వర్ కాఫీకప్పు అందుకున్నాడు. "భద్రం, తెల్లారగానే మన పేషెంటుకి గుహ వెనకభాగంలో వున్న సందులో బాత్‌రూమ్ యేర్పాటు చెయ్. కాన్వాస్ సన్నగా కట్ చేసి, తెరకట్టెయ్...."

"రెండు కాన్స్‌లో నే నీళ్ళు తెచ్చాం. స్నానాలకి నీళ్ళు చాలవు...." భద్రం అమాయకంగా అన్నాడు.

పరమేశ్వర్ పకపక నవ్వాడు. "తనున్నస్థితిలో ఆమె

స్నానం గీనం చేయడు. బాత్ రూమ్ పర్సస్ వేరు....”

భద్రం అర్థమైనట్టు తలాడిస్తూ వెళ్ళిపోయాడు.

7

కౌండిన్య చేతిలోంచి రిసీవర్ క్రెడిల్ మీదికి జారింది. తలెత్తి యెదురుగా వున్న గోడకేసి చూశాడు.

స్టెయిన్ లెస్ స్టీల్ ఫ్రేములో అందంగా బిగించబడిన శిరీష కలర్ ఫోటో అతన్ని చిరునవ్వుతో చూస్తోంది. తన స్నేహితురాళ్ళ నెవర్నీ శిరీష యివాళ కల్సుకోలేదు. ఎవరింటికీ వెళ్ళలేదు వాళ్ళతో ఆమె మాట్లాడి కూడా రెండు వారాలు దాటింది. అతను టైమ్ చూశాడు పదిన్నర! శిరీష ఎక్కడికెళ్ళింది?

కౌండిన్య తన మతిమరుపును తిట్టుకుంటూ మళ్ళీ రిసీవ రెత్తాడు. ఏదేనా సుస్తీచేసి శిరీష ఒక్కతే పార్కు నుంచి యే టాక్సీలోనో డాక్టర్ సుబ్బలక్ష్మి నర్సింగ్ హోమ్ కి వెళ్ళివుండొచ్చు! అతని చూపుడు వేలు చకచకా నెంబర్ని తిప్పింది.

అటువేపు ఎవరో పలికారు. కౌండిన్య శిరీషను గురించి అడిగాడు. నిమిషంపాటు విని, రిసీవర్ని పడేశాడు బలహీనంగా. శిరీష తనకి బాగా తెలుసనీ, ఆమె హాస్పిటల్ కి రాలేదనీ అంది డ్యూటీ నర్స్.

కౌండిన్య అలసటగా సోఫాలో వెనక్కి వాలాడు. మండుతున్న కళ్ళని రెప్పలతో కప్పేశాడు. అతని మెదడులో, అతని హృదయంలో, అతని ప్రతి అణువులో ఒకటే ప్రశ్న: శిరీష ఎక్కడి కెళ్ళింది?

ఆమెకి యేదేనా యాక్సిడెంట్ సంభవించిందా? ఎవరేనా ఆమెని యేదో హాస్పిటల్లో చేర్పించారా? తనకి ఫోన్ చేయలేని స్థితిలో వుందా ఆమె? కమ్మాలతో కది

పిన నిప్పులోంచి లేచే రవ్వల్లా ఎన్నో ఆలోచనలు అతని లోంచి లేస్తున్నాయి.

తనిప్పుడు చేయవలసిందల్లా సిటీలోని పోలీస్ స్టేషన్లకీ, ప్రైవేట్ హాస్పిటల్స్‌కీ ఫోన్ చేయడమే. ఫోన్ కిందున్న డైరెక్టరీని తీసి అతను నెంబర్లు వెతకడం ప్రారంభించాడు.

ఉన్నట్టుండి టెలిఫోన్ మోగింది. కౌండిన్య అదిరిపడి, రిసీవర్ని ఎడం చెవి దగ్గరకు లాక్కున్నాడు.

“యస్....” అన్నాడు.

“సినీరచయిత కౌండిన్యనా?” బొంగురు కంఠం మళ్ళీ ప్రశ్నించింది.

“యస్!....మీ రెవరు....?” కౌండిన్య అడిగాడు.

“మిస్టర్ కౌండిన్యా. నీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలి. పక్కన ఎవరూ లేరుగా?”

ఏకవచన ప్రయోగం! తనని ఏకవచనంలో సంబోధించే నలుగురైదుగురు సన్నిహితుల్లో యే వొక్కరి కంఠమూ కాదది!

“హూ యీజ్ దట్?” కౌండిన్య కొంచెం కోపంగా అడిగాడు.

అటువేపు నుండి బొంగురుకంఠం నవ్వింది. “చెప్పినా నీకు తెలీదు! వొంటరిగా వున్నావా?”

“వేళాపాళా లేకుండా యేమిటి న్యూసెన్స్! యూ ఆర్ డిస్టర్బింగ్ మీ....” కౌండిన్య అరిచాడు.

“ఐ నో యూ ఆర్ డిస్టర్బ్‌డ్! నీ భార్య, నెల రోజుల్లో నీ కో కొడుకుని బహూకరించబోయే నిండు చూలాలైన నీ అరో ప్రాణం నా చేతుల్లోవుంది!”

“వాట్? ఏమిటిది? ఎవరు?....” కౌండిన్య ఆత్రంగా

బొబ్బపెట్టసాగేడు.

"నోరు మూసుకుని, చెవులు తెరుచుకుని విను. నీ భార్య నా చేతిలో ఇరుక్కుని వుంది. ఆమె క్షేమంగా వుండాలంటే, ఆమె గర్భిణిగా నీకు దక్కాలంటే నువ్వు నేను చెప్పినట్టు వినాలి! ఇరవై నాలుగు గంటల్లోగా నువ్వు నాకు...."

"వాటీస్ దిస్? ప్రాక్టికల్ జోకా?" కౌండిన్య అడ్డొస్తూ అడిగాడు.

"షటప్! నీతో సరసాలాడ్డానికి నాకు టైమ్ లేదు. ఇది ప్రాక్టికల్ జోక్ కాదని నీ భార్య కంఠం నీకు రూఢి చేస్తుంది. ఆమె సందేశాన్ని నీకు వినిపిస్తాను. చెవులు రిక్కించి విను...."

ఆశ్చర్యంతో, ఆందోళనతో కౌండిన్య చెవులు రిక్కించాడు. ఏవో అర్థంలేని చిన్న చిన్న శబ్దాలు వినిపిస్తున్నాయి. కటాలున ఒక స్త్రీ కంఠం ఆ శబ్దాల్ని మింగేసింది.

"ఏమండీ, నేను .... నేను .... శిరీషని. వీళ్ళు.... వీళ్ళెవరో నన్ను .. బంధించారు. వాళ్ళడిగింది మీరు యిస్తే. నన్నొదిలేస్తారుట...." ఆమె కంఠంలో ఏడుపు ధ్వనిస్తోంది. "నాకు.... నా కెంతో గాబరాగా వుంది. భయంగా వుంది. వాళ్ళడిగింది యిచ్చేసి నన్ను యింటికి తీసుకెళ్ళండి. నేను...." ఏదో బటన్ నొక్కబడిన శబ్దం వినిపించింది కౌండిన్యకి.

మొదట్లో అది శిరీష కంఠంకాదేమో అనిపించిందతనికి. కానీ మాట్లాడే వేగం. అక్షరాన్ని నొక్కుతూ పలికే విధానం అది శిరీష కంఠమే అని చెప్తున్నాయి. అతని మొహం, వొళ్ళూ చెమటతో తడుస్తున్నాయి. జరుగు

తోంది కలా? నిజమా? బొంగురుకంఠం అతని అనుమానాన్ని, ఆలోచనల్ని తుడిచేసింది.

“నీ భార్య చెప్పింది విన్నావు. ఏ అపాయమూ జరక్కుండా ఆమె నిన్ను చేరుకోవాలంటే నువ్వు పది లక్షలు చెల్లించుకోవాలి; ఇరవై నాలుగ్గంటల్లోగా!”

“ఇది అన్యాయం. కిడ్నాపింగ్ కి శిక్ష యేమిటో నీకు తెలీదనుకుంటాను. ఆమెని వొదిలెయ్. పోలీసు రిపోర్టు ఇవ్వకుండా జరిగింది మరిచిపోతాను....”

“షటప్! నీ నుండి ఇండియన్ పీనల్ కోడ్ గురించి వినడానికి నిన్ను పలకరించలేదు. ఇచ్చిన గడువులోగా నువ్వు ముడుపు చెల్లించకపోతే, నీ భార్య నీ దగ్గర కొస్తుంది. కాని ఇప్పట్లా కాదు. ఆమె గర్భంలో అతి జాగ్రత్తగా మీరు కాపాడుకుంటున్న మీ యిద్దరి ప్రతిరూపం బైటికి లాగబడుతుంది. ఒక మొరటు వైద్యుడు మత్తుమందు యివ్వకుండా, చేతులకి గ్లవ్స్ వేసుకోకుండా ఆమె గర్భంలోంచి శిశువుని లాగేస్తాడు; ఆవు కడుపులోంచి చచ్చిపోయిన దూడను ముక్కలు ముక్కలుగా నరికి యివతలికి లాగినట్టు! అర్థమైందా?”

కౌండిన్య తన చెవుల్ని నమ్మలేకుండా వున్నాడు. రిసీవర్ని పట్టుకున్న అతని చెయ్యి వణుకుతోంది. గొంతుకలోంచి యేదో ద్రవం నాలుకమీదికి ప్రవహిస్తోంది. వాంతి అయ్యేలా వుంది.

“అర్థమైందా?” బొంగురుకంఠం అతని చెవిలో మొరిగినట్టు అడిగింది.

తనని మెల్లిగా అదుపులోకి తెచ్చుకుని, కౌండిన్య నాలుకతో పెదాల్ని తడుపుకున్నాడు. “శిరీషని యేమీ చేయకండి! ప్లీస్ ....ఆమె....”

అటువైపు కంఠం నవ్వింది. "నేను చెప్పినట్టు నువ్వు చేస్తే ఆమెని యేమీ చెయ్యం. అంతా రహస్యంగా వుంచు. పోలీసుల దాకా వెళ్ళకు. ఫోను ద్వారా కూడా ఈ విషయాన్ని నువ్వు యెవరికీ రిపోర్టు చెయ్యకు. నిజం చెప్పాలంటే నేను చూడకుండా నువ్వెక్కడికీ వెళ్ళలేవు; నాకు వినిపించకుండా నువ్వు యెవరికీ యేమీ చెప్పలేవు. నా మూడో కన్ను అనుక్షణం నిన్ను గమనిస్తూ వుంటుంది. దానికి వినే శక్తి కూడా వుంది! నా హెచ్చరిక ని నువ్వు యేమాత్రం నిర్లక్ష్యం చేసినా నీ భార్య నిర్దాక్షిణ్యంగా, రాక్షసంగా శిక్షింపబడుతుంది.

"ఆమెని కంట్రోల్ చేస్తున్న వ్యక్తులు గర్భవతిని రేప్ చేయాలన్న విచిత్ర వాంఛతో సతమతమవుతున్నారు. అబార్షన్ ముందు ఆమె చాలామందిని శారీరకంగా తృప్తిపరచాల్సి వుంటుంది. అబార్షన్ జరిగాక ఆమె తిరిగీ గర్భాన్ని ధరించే అవకాశం వుండదు. గర్భస్రావం అంత క్రూడ్‌గా జరిపించబడుతుంది. ఆ తరువాత చావుబతుకుల మధ్య వూగిసలాడుతున్న ఆమెని నరమానవుడు కనుక్కోలేని ప్రదేశంలో వొదిలేసి మేం మాయమైపోతాం. నువ్వు విశ్వరూపం ధరించి గాలించేసరికి ఆమె తన శిశువు చేరుకున్న లోకానికి...."

"ఏం చేయాలో చెప్పు!" కాందిశీక విననేక అడ్డొస్తూ అరిచాడు, బొంగురు కంఠంతో.

"రైట్. రేపు సాయంత్రంలోగా పదిలక్షల రూపాయలు పోగుచెయ్. నోట్ల నెంబర్లు గుర్తించుకునే ప్రయత్నం చేయొద్దు, ఆతర్వాత ఏం చేయాలో చెప్తాను. ఫోన్ ముందు తపస్సు చేస్తూ కూచో ..."

"ప్లీస్ .... బీ రీజనబుల్! నా దగ్గర అంత పైకం లేదు.

నాలుగో అయిదో యెంత వుంటే అంతా పూడ్చి యిచ్చే స్తాను...." కౌండిన్య వణికే కంఠంతో అన్నాడు.

"నీ దగ్గర లేకపోతే యెవడో ప్రొడ్యూసర్‌కి లైఫ్ టైమ్ కాంట్రాక్టుమీద బాండెడ్ లేబరర్‌గా నిన్ను అమ్మకో! నిర్ణయించిన రేటుకి నీ పెళ్లాన్ని కొనుక్కో!" అవతలి కంఠం నిర్దాక్షిణ్యంగా, కర్కశంగా ధ్వనించింది.

కౌండిన్య యేదో చెప్పబోయాడు. కానీ అటువైపున డిస్కనెక్ట్ చేయబడింది.

8

రిసీవర్ని పెట్టేసి పరమేశ్వర్ లేచాడు. ఫోన్ పక్కనే వున్న టేప్ రికార్డర్‌ని జేబులో పెట్టేసుకున్నాడు. గది లోంచీ బైటికి నడిచి, తాళం వేశాడు. మెట్లు దిగి హోటల్ రిసెప్షన్ వైపు అడుగులేశాడు.

ఎంతో ముందు చూపుతో తను హోటల్ హాలో కౌండిన్య పేరుతో గది తీసుకున్నాడు. పరమేశ్వర్ రిసెప్షన్ ముందు ఆగాడు. కౌంటరు వెనుక గుమస్తా లేనందుకు సంతోషిస్తూ తాళంచెవిని దాని నంబరున్న మేకుకి తగిలించి ఇవతలికి నడిచాడు. కుడివైపుకి తిరిగి వాన్ ఆపిన ప్రదేశంవైపు జోరుగా అడుగులు వేశాడు.

చెట్లచాటులో ఆపిన వాన్‌కి ఆనుకుని నిలబడ్డ రాజా అతన్ని చూసి చిరునవ్వు నవ్వాడు చీకట్లో. పరమేశ్వర్ అతన్ని సమీపించాడు. ఇద్దరూ వాన్ యెక్కారు.

"రాజా నాటకంలో మొదటి రంగం పూర్తయింది. ఇక వైనాలుగ్గంటల్లో నాటకం పూర్తవుతుంది...."

"అయిదు రోజులకి మనం అన్నీ సిద్ధం చేసుకున్నాం, బాస్...." రాజా మెల్లిగా అన్నాడు. వాన్‌ని స్టార్టుచేసి మెయిన్ రోడ్లోకి ఎక్కించాడు.

"ఎందుకేనా మంచిదని అలా ప్లాన్ చేశాను. కౌండిన్య నిమిషాలమీద పైకం సర్దేసేలా వున్నాడు! పనయ్యాక ఒక్క క్షణంకూడా మనం ఇక్కడ వుండక్కర్లేదు...."

రాజు చిరునవ్వు నవ్వుతూ తలపంకించాడు.

పరమేశ్వర్ సీట్లో వెనక్కి వాలాడు. "నేను అనుకున్న దానికన్నా అధికంగా అతను హడిలిపోతున్నాడు. మనం చేయమన్నా ఆలస్యం చేసేలా లేడు! పాల సముద్రాన్ని మనం అట్టేసేపు చిలకనక్కర్లేదు, రాజూ!" పరమేశ్వర్ నవ్వుతూ అన్నాడు.

రాజు తేలిగ్గా నిట్టూర్చి చిన్నగా నవ్వాడు. "నాకిప్పు డెంతో తేలిగ్గా వుంది, బాస్. ఈ పని ప్రారంభించిన క్షణంనుంచీ యెందుకో భయం భయంగా...."

"చెరువులో ఈదే వ్యక్తి మొదటిసారి సముద్రంలో ఈదటానికి భయపడతాడు. నాతో చేరావు; క్రమంగా నీ భయం మాయమవుతుంది!" పరమేశ్వర్ సగర్వంగా అన్నాడు.

"థాంక్యూ బాస్!" అన్నాడు రాజు.

9

శిరీష తల మూశాళ్ళమీదికి వాలిపోయింది. ఆమె కాళ్ళు, చేతులూ కట్టేసి వున్నాయి. తను కూచున్న గుహలో ఆవరించిన క్రీనీడలా భయం ఆమెని ఆవరించింది.

తనని బంధించిన కిరాతకులు తన భర్తని యెంత అడుగుతారో ఖచ్చితంగా తెలీకపోయినా, డబ్బుకోసమే ఈ దౌర్జన్యం సాగుతోందని ఆమె ఊహించింది. ఇవ్వగలిగే మొత్తం అడిగితే కౌండిన్య యెడంచేత్తో పారేస్తాడు, తనకోసం.

తన భర్త బెదిరింపులకి లొంగి, డబ్బిస్తే వీళ్ళు తనని

వదిలిపెడతారా? సాధారణంగా బ్లాక్ మెయిలర్స్ విక్టిమ్స్ని ప్రాణాల్తో వదలరని ఆమె యెన్నోసార్లు చదివింది; తమని కళ్ళారా చూసిన వ్యక్తిని ప్రాణాల్తో వదలడం తమకి ప్రాణాంతకమని బ్లాక్ మెయిలర్స్కి తెలుసు! శిరీష గుండె దడదడ కొట్టుకుంది. అణువణువునా యేదో ఆందోళన విషంలా వేగంగా వ్యాపిస్తోంది.

తన మాటల్ని రికార్డు చేసి, తన భర్తకి వినిపించడానికి వెళ్ళిన ముతా వాయుకాడింకా తిరిగిరాలేదు. ఈపాటికి తన భర్తకి అంతా తెలిసివుంటుంది. పార్కు నుంచీ ఇంటికి రాని తనకోసం కంగారుపడే భర్తకి తన ఉనికి తెలిసి మరో భయంకరమైన గాబరా ప్రారంభించి వుంటుంది. భర్త మనస్తత్వం బాగా తెలిసిన శిరీష అతని రియాక్షన్ ఎలా వుంటుందో ఊహించడానికి ప్రయత్నించింది.

తనకి ఏం జరిగిందో, ఇక్కడికి ఎలా చేరిందో, ఆ 'ఇక్కడ' యెక్కడో ఆమెకి యెంత ఆలోచించినా అర్థంకాడంలేదు. తల కొద్దిగా దిమ్మగా వుంది. ఏదో మంచుతెర మెదడుని కప్పినట్టు అనుభూతి కలుగుతోంది.

మీద యేదో నీడపడ్డట్టనిపించింది శిరీష తటాలున తలెత్తి చూసింది.

సన్నగా పొడుగ్గా వున్న వ్యక్తి గాలిలో వూగే సరుగుడు చెట్టులా వూగుతూ తనముందు నిలబడ్డాడు. అతని ఎడంచేతిలో యేదో బాటిలుంది. కుడిచేతి వేళ్ళ మధ్య సిగరెట్ కాలుతోంది. అతను రెప్పవేయకుండా తననే చూస్తున్నాడు. పొడుగాటి జుట్టు భుజాలమీద పడుతోంది. మీసాలులేని ఆడంగి మొహం, హిప్పీలా హోమోలా అవుపిస్తున్నాడతను.

కమల్ ఆమె దగ్గరగా అడుగులేశాడు. మోకాళ్ళ మీద గడ్డం ఆన్చుకుని శిరీష అతన్నే చూస్తోంది. ఎర్రగా వున్న అతని చిన్న కళ్ళు ఆమెలో యేదో భయాన్ని నింపుతున్నాయి. అతని పెదవులు విచ్చుకున్నాయి.

"యూ ఆర్ బ్యూటీ!" అన్నాడతను మత్తుగా తూలుతూ. "ఇంత అందంతో లక్షలాది ప్రేక్షకుల కళ్ళకి విందుచేయకుండా కాగితాలమీద పిచ్చిరాతలు రాసే సన్నాసిని కట్టుకుని నువ్వు దేశానికి ద్రోహం చేశావ్!" కమల్ ఆగి, తూలి, ఘాటుగా దమ్ములాగి పొగ వదిలాడు.

వణుకుతున్న చేత్తో విస్కీ బాటిల్ని నోటికి అందించాడు. విస్కీ అతని గొంతులోకి దిగింది. నోటికి రెండు వైపుల్నుంచీ కాలువలుగా కారుతూ అతని ఛాతీని తడుపుతోంది.

సీసాను నోటినుంచీ బలవంతంగా దూరంగా లాగి, గాజు కళ్ళతో అతను ఆమెని చూశాడు. "మాపుల్తో మనుషుల్ని మందలు మందలుగా కట్టేసే నిషన్న చేతులూ కాళ్ళూ కట్టి పడేయడం ... అన్యాయం. నువ్వు సై అంటే కట్లు విప్పి పారేసి నిన్ను ఈ చేతుల్తో బంధిస్తాను! సే సై డార్లింగ్!"

"గెటౌట్!" శిరీష కోపంతో, అసహ్యంతో అరిచింది.

"డోంట్ సే గెటౌట్ డార్లింగ్! నువ్వు....నా.... పేషెంటువి. ఇవాళ్టినుంచీ నిన్ను చూసుకునేది నేను; డాక్టర్ సుబ్బలక్ష్మి కాదు!" కమల్ పిచ్చిగా నవ్వాడు. "అయామ్ యువర్ పర్సనల్ ఫిజీషియన్, డార్లింగ్.

వానుంచీ మొహం తిప్పుకోవొద్దు!" అంటూ కమల్ ఆమె గడ్డ కింద చెయ్యి వేసి ఆమె మొహాన్ని బలవంతంగా తన వేపు తిప్పుకున్నాడు.

నీళ్ళతో నిండిన కళ్ళతో శిరీష దీనంగా చూసింది. "ప్లీస్, నన్నొదిలి వెళ్ళిపో" అందామె.

కమల్ మొండిగా తల అడ్డంగా ఆడించాడు. "ఇంపాసిబుల్. దీపానికి దూరంగా పురుగూ, అయస్కాంతానికి దూరంగా లోహమూ వుండలేవు!" మాట్లాడుతోంటే విస్కీ వాసన గుప్పున కొడ్తోంది.

కమల్ చెయ్యి ఆమె తలమీద పడింది. ఎర్రగా వున్న ఆమె పెదిమల్ని ఆకలితో చూస్తూ అతను ముందుకి జరుగుతున్నాడు. బలాన్నంతా కూడదీసుకుని శిరీష పక్కకి వాలింది. పక్కవాటంగా పడున్న శిరీషని కమల్ చూస్తూ ఆమె మోకాళ్ళు పట్టుకుని వెల్లకిలా తిప్పాడు.

శిరీష కళ్ళలో కోపం, అసహ్యం, భయం, ఆందోళనా కలిసి వున్నాయి. సింహం గుహలో చిక్కిన జింకలా వుందామె. కమల్ చెయ్యి ఆమె బుగ్గల్ని అదిమిపట్టుకుంది. "నీ డాక్టర్ని తిన్నగా ప్రేమగా ట్రీట్ చేయి డార్లింగ్!" అన్నాడతను నవ్వుతూ.

డేగ కాళ్ళకింద ఇరుక్కున్న చిన్నారి పిట్టలా నిస్సహాయంగా చూస్తోందామె. కమల్ మొహం ఆమె మీదికి వాలుతోంది. పొడుగాటి అతని వెంట్రుకలు ఆమె చెంపల్ని తాకుతున్నాయి.

చందమామను కబళించే రాహువులా జరుగుతున్న కమల్ తల హఠాత్తుగా ఆగింది. క్షణంలో అతని శరీరం కూడా తలతోబాటు పైకి లేచింది. శిరీష ఆశ్చర్యంగా చూస్తోంది.

కమల్ బనియన్ వెనక భాగాన్ని వదిలేసి, ముందు భాగాన్ని యెడంచేత్తో పట్టుకున్నాడు భద్రం. వెనక నుంచీ తన ముందుకి వచ్చి నిలుచున్న భద్రాన్ని కమల్ రౌద్రంగా చూశాడు, రెండు చేతుల్తో భద్రం చేతిని లాగేసే ప్రయత్నం చేశాడు.

"లీవ్ మీ!" అరిచాడు కీచుగా.

"కాపలా కాయాల్సిన ప్రదేశం వదిలిపెట్టి ఇక్కడి కెందుకొచ్చావ్, డాక్టర్?" భద్రం తీక్షణంగా చూస్తూ అడిగాడు.

"షటప్! నన్నడగటానికి నువ్వెవరు?" కమల్ హుంకరించాడు.

భద్రం చెయ్యి ఒకసారి ముందుకి జరిగింది. కమల్ తల తటాలున వెనక్కి వాలింది. మెడలో మెటిక విరిగింది. కమల్ బాధతో పళ్ళు ఇకిలించాడు. "ఉండమన్నచోట ఉండాలి డాక్టర్!" భద్రం వికటంగా నవ్వుతూ అన్నాడు.

"వదులు!" కమల్ అరిచాడు.

"ఆమె దగ్గరగా వెళ్ళొద్దని బాస్ నీకు చెప్పాడు..."

"నా కెవడూ బాస్ లేడు నాకు బాస్ నినే!" కమల్ హుంకరించాడు, గుడ్లురుముతూ.

భద్రం యెగతాళిగా నవ్వాడు. "ప్రస్తుతం విస్కీ నీ బాస్‌గా వుందని నాకు తెలుసు! బుద్ధిగా ఉండకపోతే బోర్లా పడుకోబెట్టి తాగిన విస్కీనంతా కక్కేలా మోకాలితో వీపుమీద తొక్కుతాను!" అంటూ విసురుగా కమల్ని వెనక్కి తోశాడు. కమల్ వెల్లకిలా పడ్డాడు.

భద్రం ముందుకి నడిచి, కమల్ పొట్టకి రెండు వేపులా కాళ్ళుంచి నించుని, తీక్షణంగా అతని కళ్ళల్లో

చూశాడు. కమల్ కళ్ళల్లోని కోపం భయంగా మారింది. మెల్లిగా జరిగి, కూచున్నాడు.

"లేచి వెళ్ళి బైటకూచో డాక్టర్! ఈసారి తిక్క వేషాలేస్తే ముక్కలు విరగ్గొట్టి పుత్తూరుకి పార్సెల్ చేస్తా!" భద్రం నవ్వుతూ అన్నాడు. కమల్ తోక ముడుచుకుని, మెల్లిగా బైటికి నడిచాడు.

భద్రం తలతిప్పి శిరీషవైపు చూశాడు కిలకిలా, నిస్సహాయంగా పడున్న శిరీష ఆశ్చర్యంతో అతన్ని చూస్తోంది. భద్రం ఆమె దగ్గరగా నడిచి, గోడలాగా ఉన్న బండకి ఆమె వీపుని ఆన్చి కూచోబెట్టాడు. శిరీష మౌనంగా అతన్ని చూస్తోంది. భద్రం లోపలికెళ్ళి ప్లాస్టిక్ మగ్‌తో తిరిగొచ్చాడు. ఆమె దగ్గరగా ఆగాడు.

"కాఫీ తాగుతానంటే తాగిస్తాను. కట్లు విప్పడానికి బాస్ అనుమతిలేదు" అన్నాడు ఆమెవైపు చూస్తూ.

శిరీష వద్దన్నట్లు తల అడ్డంగా తిప్పింది. భద్రం వెనుదిరిగాడు. శిరీష అతన్ని చూస్తోంది....

10

సిగరెట్ పీకని కిటికీకి విసిరి మరో సిగరెట్ వెలిగించాడు కౌండిన్య.

గంటనుంచీ అతను కాలు కాలిన పిల్లిలా గదిలో తిరుగుతున్నాడు. మనసుని కలచివేస్తున్న ఆలోచనలు అతన్ని స్థిమితంగా కూచోనివ్వడంలేదు. సిగరెట్ పీకలు చిందరవందరగా పడి అతని కాళ్ళకింద నలుగుతున్నాయి.

తనకి ఎవరూ శత్రువులు లేరు. తను ఎవరికీ ద్రోహం చేయలేదు అయినా తనకి అక్రమంగా శిక్ష విధించబడుతోంది తను దూరంగా ఉండి మంటవేడిని భరిస్తు

న్నాడు. అమాయకురాలు శిరీష మంటల్లో కాలుతోంది!

ఈ భయంకరమైన విపత్తు గురించి తను యెవరికీ చెప్పుకోడు! ఎవరి సహాయమూ తీసుకోలేడు. "అనుక్షణం నా మూడో కన్ను నిన్ను గమనిస్తూ వుంటుంది!" కౌండిన్య శరీరం ఒక్కసారి జలదరించింది.

ఏదో జ్ఞాన నేత్రం తన ప్రతి కదలికను గమనిస్తోందన్న ఆలోచన రాగానే అతని గుండె దడదడ కొట్టుకుంది. అంటే బ్లాక్ మెయిలర్ తనని అనుక్షణం గమనించడానికి ఎవడినో నియమించాడు!

అడిగిన పైకం గిరాటేసి శిరీషని రక్షించుకోవాలి. కౌండిన్య లోపల్లోపలే లెక్క వేయసాగేడు. బాంకుల్లో ఆరులక్షల దాకా వుంటుంది. లాకర్లో ఉన్న శిరీష నగల్ని అమ్మితే మరో రెండులక్షలు రావొచ్చు. ఎంతో ప్రేమతో తను చేయించిన నగల్ని అమ్మాలంటే అతని కెందుకో బాధగా ఉంది. ఇంకో రెండు లక్షలు తను సర్దాలి.

ఉన్నపళాన రెండులక్ష లడిగితే ప్రొడ్యూసర్ భజగోవిందం యిస్తాడా? చాలా బడ్జెట్లో కొత్త చిత్రం ప్రారంభించాడతను. తను వేధిస్తే అంత అవసరం యేమొచ్చిందని అడుగుతాడు. చెప్తే క్షణంలో పదిలక్ష లయినా యిస్తాడు. కానీ తను చెప్పలేడు!

'ఎవడో ప్రొడ్యూసర్ కి లైఫ్ టైమ్ కాంట్రాక్టుమీద బాండెడ్ లేబరర్ గా నిన్ను అమ్మేసుకో!' బ్లాక్ మెయిలర్ కంఠం అతని చెవిలో పాముబుసలా శబ్దం చేసింది

పచార్లు మానేసి సోఫాలో కూలబడి కౌండిన్య టెలిఫోన్ రిసీవరెత్తాడు.

అప్రయత్నంగా టైమ్ చూశాడు. రెండు దాటింది. ఏదీశాని వేళ నిద్ర లేపితే భజగోవిందం పసుక్కుంటూ దేమో. అయినా తప్పదు.

కౌండిన్య ఆలోచిస్తూ భజగోవిందం నెంబరు తిప్పాడు....

11

జానీవాకర్ బాటిల్లోంచి రెండు గుక్కలు తాగి పరమేశ్వర్ బాటిల్ని పక్కనే ఉన్న భద్రానికి అందించాడు.

రెక్కలు కత్తిరించి కాళ్ళు ముడేసిన పావురంలా కూచున్న శిరీషని అతను తదేకంగా చూశాడు. ఆమె కళ్ళల్లో ప్రత్యక్షమౌతున్న భయం అతనికి చక్కిలిగింతలు పెడ్తోంది.

"భద్రం! ఆమె చేతులు మాత్రం విప్పేయి!" పరమేశ్వర్ ఆజ్ఞాపించాడు.

భద్రం శిరీష చేతుల్ని విప్పాడు. శిరీష అర్థంకానట్టు చూస్తోంది. డాక్టర్నంటూ తనమీదికి రయిగుడ్డ కాని తప్ప తతిమ్మా ముగ్గురూ తాగుతున్నారు. వాళ్ళు తెలీకుండా తాగి తనని....

భద్రం తనని రక్షించినప్పట్నుంచీ తనమీద అత్యాచారం జరగదనిపిస్తున్నా కూడా ఈ క్షణంలో ఆమె గుండెని భయం పిడికిలిలా బిగిస్తోంది.

"మన అతిథికి చపాతీ సర్వ్ చేయ్ భద్రం!" పరమేశ్వర్ అర్డరిచ్చాడు.

క్షణంలో చపాతీ ప్లేటుని ఆమె కాళ్ళదగ్గరగా పెట్టి భద్రం దూరంగా జరిగాడు.

శిరీష క్షణకాలం చపాతీని చూసి, పరమేశ్వర్ వైపు

కళ్ళు తిప్పింది. అతని కళ్ళు చంద్ర నిప్పుల్లా ఎర్రగా వున్నాయి. శిరీష కట్లు తిప్పించబడిన తన చేతుల్ని చూసుకుంది. ఎర్రగా యేర్పడ్డ వాతలు గాజుల్లా అవుపిస్తున్నాయి. ఎడమ చేత్తో కుడి చేతిని మెల్లగా రుద్దుకుంది....

"చపాతీ తీసుకో!" పరమేశ్వర్ కంఠం విని ఆమె తలెత్తి చూసింది.

సిగరెట్టు నోట్లో పెట్టుకోబోతూ అతను ఆమెవైపు చిరునవ్వుతో చూశాడు. అతని కళ్ళు నవ్వడంలేదు, లైటర్ క్లిక్కుమంది. ఆ వెలుగులో అతని కళ్ళు నివురు తొలగించడ్డ నిప్పుకణాల్లా మెరిశాయి.

అతని చెయ్యి భద్రంవైపు సాగింది. భద్రం విస్కీ బాటిల్ని అందించాడు. నోటి నిండుగా విస్కీ తాగి పుక్కిలిస్తున్నట్టు విస్కీని నోరంతా కలయదిప్పాడు. చివరికి గుటకలు వేసి, తృప్తిగా నిట్టూర్చాడు.

శిరీష అతన్ని తదేకంగా చూసింది. "ఆయనతో మాట్లాడావా?" వణికే కంఠంతో ఆమె అడిగింది.

పరమేశ్వర్ కనుబొమలు కొద్దిగా పైకి లేచాయి. నోట్లో యిరుక్కున్న సిగరెట్ కదిలింది. "ఆహా! పరిస్థితి వివరించాను. పదిలక్షలు చెల్లించి నిన్ను విడిపించుకొమ్మన్నాను...."

"ఆయన....ఆయనేమన్నారు?" శిరీష కంగారుగా ప్రశ్నించింది. పదిలక్షలు! గుడ్ గాడ్ ...

"అంత లేదన్నాడు. బేరం చేశాడు. నువ్వు క్షేమంగా వుంటే అదే తనకి 'పదివేలు' అన్నట్టు మాట్లాడాడు! అతని టేలెంట్ ని పర్మనెంట్ గా ఎవరికో అమ్మేసి, పదిలక్షలు పోగుచేసి, నిన్ను కొనుక్కొమ్మని

సలహా యిచ్చాను!" అన్నాడు పరమేశ్వర్.

శిరీష తన ఆసహాయతని తాత్కాలికంగా మరిచిపోయింది. "మేం నీకేం అపకారం చేశాం? ఈ స్థితిలో వున్న నన్ను ఇలా తీసుకురావడానికి నీకు బుద్ధెలా పుట్టింది? నువ్వు ..."

పరమేశ్వర్ సిగరెట్ని తీసి, బూడిదను చూసి, కింద పడేశాడు. అరచేత్తో ప్రేమగా తన మెడని రుద్దుకున్నాడు, నవ్వుతూ చూశాడు. "నిజం చెప్పాలంటే నువ్వేం అపకారం చేయలేదు. నీ భర్త అర్థంలేని అక్షరాలు రాసి లక్షల్లక్షలు సంపాయించి, బ్లాక్ వనీ మేట వేస్తున్నాడు. డబ్బు ఒకేచోట నిలవ వుండకూడదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే చెమటోడ్చకుండా సంపాయించి, దోచి డబ్బు మేట వేయడం నీ భర్త చేసిన, చేస్తున్న అపకారం!"

"నీ వాదన పిచ్చిగా వుంది. న్యాయంగా డబ్బు సంపాదించే శక్తిలేని నీలాంటివాళ్ళ వాదన యిలాగే వుంటుంది...."

"షటప్! అడిగిన మొత్తాన్ని ముట్టజెప్పి నీ భర్త నిన్ను విడిపించుకువెళ్ళాలని ప్రార్థించు!" అన్నాడు నవ్వుతూ.

అడిగిన మొత్తం పదిలక్షలు! శిరీష ఆందోళనతో ఆలోచించింది.

"పదిలక్షలు యివ్వకపోతే....ఏం చేస్తారు?" ఆమె సన్నటి కంఠంతో ప్రశ్నించింది.

పరమేశ్వర్ విస్కీ బాటిల్ని నోటికి అందించబోతూ ఆగాడు. ఆమెని తదేకంగా చూశాడు. చిరునవ్వుతో అతని పెదవులు కదిలాయి. "ఇవ్వలేకపోయినా, ఈ

విషయం ఇతర్లకి చెప్పినా, పోలీసు రిపోర్టిచ్చినా, డబ్బు అందజేయడానికి నా సూచనలకు విరుద్ధంగా వొంటరిగా రాకపోయినా, నాకు అనుమానం కలిగేలా ప్రవర్తించినా, అతని ఆరోప్రాణమైన నీకు అబార్షన్ చేయబడుతుంది. దానికి ముందు...."

"నో!" శిరీష బిగ్గరగా అరిచింది. ఆమె అరుపులో గుహ మార్మోగింది. తటాలున రెండు చెవుల్నీ మూసుకుంది.

అప్రయత్నంగా ఆమె రెండు చేతులూ జోడించింది. "నీ కాళ్ళు పట్టుకుంటాను. అంత.... అంత.... దారుణం చేయకు...." అందామె వెక్కుతూ.

పరమేశ్వర్ చిరునవ్వుతో చూశాడు. "నా కాళ్ళా వేళ్ళా పడి లాభంలేదు. నీ భర్త నా మాట పాటించాలని ప్రార్థిస్తూ కూచో. నేను రికార్డు చేయబోయే నీ రెండో సందేశంలో నీ మొగుణ్ని ప్రాధేయపడు. అర్థించు!.... ప్రస్తుతానికి ఆ చపాతీ తిను!"

శిరీష కళ్ళు తుడుచుకుంది. తను పాషాణం ముందు ప్రార్థన చేస్తూ కూచుంది! ఆమె కళ్ళు చపాతీ ప్లేటు వైపు తిరిగాయి. ఆమె కుడిచెయ్యి ప్లేటు వైపు జరిగింది. వేళ్ళు ప్లేటు అంచుని చుట్టేశాయి. మరుక్షణం పింగాణీ ప్లేటు చక్రంలా గిర్రున తిరుగుతూ వెళ్ళి ఎదురుగా వున్న రాతి గోడకి కొట్టుకుని శబ్దం చేస్తూ పగిలింది. ప్లేటుముక్కల్ని కాసేపు చూసి, పరమేశ్వర్ పకలబడి నవ్వాడు. నవ్వుకుని రాజా వైపు చూశాడు.

"రాజు, ఇద్దరూ పడుకోండి. గంటదాకా నేను మేలుకుంటాను. తరవాత మిమ్మల్ని లేపుతాను" అన్నాడు సిగరెట్ తీస్తూ. సాలోచనగా శిరీష వైపు చూశాడు.

"భద్రం, ఆమె చేతులు కట్టేయ్. లేకపోతే సత్యభామ బాణాలు విసిరినట్టు ఆమె చక్రాలు విసురుతుంది!" అన్నాడతను నవ్వుతూ.

ఆమె చేతులు యథాప్రకారంగా కట్టేసి ఇద్దరూ నిద్రకు పడ్డారు.

శిరీష అరగంటకి పైగా అలాగే కూచుండిపోయింది.

ఆమెకి నిద్ర రావడంలేదు. సలగ్గొట్టేస్తున్న శరీరం నొప్పిని ఆమె పూర్తిగా మరిచిపోయింది.

ముఠా నాయకుడు చెప్పిన షరతు ఆమెను గందరగోళంలో ముంచేసింది. ఉద్దేశపూర్వకంగా కాకున్నా కౌండిన్య చిన్న పొరపాటు చేస్తే, పొరపాటు చేసినట్టు బ్లాక్ మెయిలర్ కి అనుమానం వస్తే తన గతేమిటి? నవ్వుతూ క్రౌర్యాన్ని వెదజల్లుతున్న బ్లాక్ మెయిలర్ ఆరితేరిన దుర్మార్గుడనీ, అతనిలో శాడిస్టు లక్షణాలున్నాయనీ ఆమె పసిగట్టింది. అందర్నీ తను బాగా చూసింది. వాళ్ళ మాటలు వింది.

తన భర్త పైకం చెల్లించినా వీళ్ళు తనని, తమ దారుణ నేరానికి ప్రత్యక్ష సాక్షి అయిన తనని ప్రాణాలతో వదులుతారా? ఆమె మూసిన కళ్ళు తెరిచి పరమేశ్వర్ వైపు చూసింది.

భంగుకొడుతున్న గోసాయిలా అతను సిగరెట్ పీలుస్తూ కళ్ళు సగం మూసి కూచున్నాడు. డాక్టర్ నంటూ వచ్చిన నీచుడికి పుట్టిన దుర్బుద్ధి అతనిలో లేనట్టుంది. డాక్టర్....! తనకి అబార్షన్ చేయడానికి నియమించబడ్డ డాక్టర్!

శిరీష తల గిర్రున తిరగసాగింది. కళ్ళు గట్టిగా మూసుకని, తనని అదుపులోకి తెచ్చుకుందామె. తను గాబరా

పడకూడదు! డాక్టర్ సుబ్బలక్ష్మి పదే పదే చెప్పింది....

శిరీష ధైర్యంగా ఆలోచించడం ప్రారంభించింది. స్వప్రయోజనం కోసం, కౌండిన్యని బెదరగొట్టడం కోసం బ్లాక్ మెయిలర్ తన మాటల్ని క్యాసెట్ ద్వారా వినిపిస్తున్నాడు. ఏదోవిధంగా తను భర్తకు తన కంఠాన్ని వినిపించగలుగుతోంది.

తను ఏ ప్రదేశంలో వుందో తనకి తెలీదు. కానీ నగరంలో వుందని మాత్రం ఖచ్చితంగా తెలుసు. తన ఉనికిని రహస్యంగా తన భర్తకి తెలియజేయాలి. ఎలా? ఎలా? ఎలా?

శిరీష బుర్ర వేడెక్కుతోంది. ఈ అవకాశాన్ని తను తెలివిగా ఉపయోగించుకోవాలి. ఎలా?

12

ఉదయం పది కావస్తోంది.

కౌండిన్య సోఫాలో కూచుని ఆలోచిస్తున్నాడు. ఏవేవో హృదయాన్ని కలవరపెట్టే ఆలోచనలు ఒకదాన్నొకటి తరుముకొస్తున్నాయి.

వంటామె పొద్దుటే వచ్చి శిరీష గురించి అడిగింది. స్నేహితురాలితో ఉందనీ మర్నాడొస్తుందనీ అతను అబద్ధమాడి ఆమెని పంపేశాడు. గదంతా చెల్లాచెదురుగా పడున్న సిగరెట్ పీకల్ని చూస్తున్న మంగమ్మ చూపులు అతని అబద్ధాన్ని నమ్మటంలేదని చెప్పాయతనికి!

టెలిఫోన్ మోత అతన్ని ఆలోచనల ఊబిలోంచీ ఇవతలికి లాగింది. అతను రిసీవర్ని చెవికి ఆనించాడు.

“కౌండిన్య! పైకం సిద్ధం చేశావా?”

“శిరీష ఎలా వుంది?” కౌండిన్య ఆత్రంగా అడిగాడు. అటువైపునుంచీ నవ్వు వినిపించింది. “నా పాటకి

అనుగుణంగా నువ్వు నాట్యం చేసినంతకాలం ఆమె క్షుభ్రంగా ఉంటుంది. నా ప్రశ్న విన్నావు నువ్వు....”

కౌండిన్య నిట్టూర్చాడు. “ఆమెని భయపెట్టకండి. మీ రడిగింది యివ్వడానికి ప్రయత్నం చేస్తున్నాను....”

“నాకు తెలిసినంతవరకూ ఆమె నికన్నా ధైర్యంగా వుంది....అన్నట్టు నీ ఆఖరి ప్రాణం యేదో చెప్తోంది విను....” అన్నాడతను. కాసేపట్లో శిరీష కంఠం తీగమ్మట పాడుతూ కౌండిన్య చెవిలో ధ్వనించింది.

“ఏమండీ....ఇప్పటిదాకా క్షేమంగానే వున్నాను. భయంతో రాత్రంతా నిద్ర పట్టలేదు. అతనడిగింది త్వరగా ఇచ్చేయ్యండి. అతను చెప్పినట్టు జాగ్రత్తగా నడుచుకోండి. మీరు పొరబాటు చేస్తే వాళ్ళు....నాకు....అబార్షన్....” శిరీష కంఠం వణ్కుతోంది

“ఎలాగైనా సర్దండి. నేను నేను కానేమో అన్న అనుమానం రావొచ్చు. డార్లింగ్....నేను....నీ శిరీష కుసుమాన్ని...రాజా....నీ రాకుమారిని రక్షించుకో.... ఆలస్యం చెయ్యొద్దు....”

“విన్నావా?” బొంగురుకంఠం కౌండిన్య చెవిలో గాండ్రించింది.

కౌండిన్య జవాబు చెప్పలేదు. అతని చెవిలో శిరీష మాటలూ, ఏడుపూ ఇంకా గింగురుమంటూనే వున్నాయి. నూతిలోంచి పిలుస్తూ, ఏడుస్తోందామె కంఠం. పాతాళం లోంచి తనని పైకిలాగి రక్షించమంటోంది. వెచ్చగా జారిన అశ్రువుల్ని కౌండిన్య కోపంతో తుడుచుకొన్నాడు. అతనిలో ఆగ్రహం నిస్సహాయంగా బుసకొట్టుతోంది.

“నువ్వు మనిషివేనా? అబార్షన్ చేస్తామని ఆమె

ఎందుకు భయపెట్టావ్?" కౌండిన్య అరిచాడు.

బొంగురు కంఠం వికటంగా నవ్వింది. "జరగబోయేది తెల్సుకోవడం మనిషికి ఎప్పుడూ మంచిది!"

తన ఆగ్రహం పనిచేయదని కౌండిన్య గ్రహించి, కంట్రోల్ చేసుకున్నాడు.

"ఆమెని ఇంకా గాబరా పెట్టొద్దు. ఉద్రేకపడితే ఆమెకి అబార్షన్...."

"డోంట్ గెట్ ఎక్సైటెడ్! నీ భార్యకి అంత తేలిగ్గా అబార్షన్ జరిగేలా లేదు. జరగాలంటే మా డాక్టర్ చెయ్యి చేసుకోవాల్సిందే! ఆల్ రైట్....పది లక్షలు రెడీగా వుంచి, అందుబాటులో వుండు. యెలా అందజేయాలో తరువాత తెలియజేయబడుతుంది."

రిసీవర్ని అలాగే ఉంచుకుని కౌండిన్య బొమ్మలా కూచుండిపోయాడు.

13

పదిన్నర దాటింది.

కౌండిన్య కారును కాంపౌండులోంచి మెయిన్ రోడ్డు యెక్కించి, ఎడంవైపుకి తిప్పి పోనిచ్చాడు. తన అకౌంట్స్ వున్న నాలుగు బాంక్స్‌కీ అతను ఫోన్ చేశాడు. తను విత్‌డ్రా చేయదలచిన మొత్తాల్ని సిద్ధంగా వుంచమన్నాడు. స్టేట్ బాంక్ లాకర్లో వున్న నగల్ని ధీంజ్ మల్ దుకాణంలో అమ్మేయడానికి నిర్ణయించుకున్నాడు.

కౌండిన్య కారు మెయిన్ రోడ్ లోకి తిరగ్గానే, వంద గజాల దూరంలో ఆగిన నల్లరంగు డాడ్జి కారు కదిలింది. నల్లటి కళ్ళద్దాలు ధరించిన వ్యక్తి సావధానంగా కౌండిన్య కారును వెంబడించసాగేడు. అతని నోట్లోంచి సిగరెట్

వాలుగా వేళ్ళాడుతూ పొగ చిమ్ముతోంది.

పది నిమిషాల్లో కౌండిన్య స్టేట్ బాంక్ ముందు కారాపి దిగాడు. తన కారును ఫాలో చేస్తూ, కొంచెం దూరంలో ఆగిన బ్లాక్ డాడ్జి కారును అతను గమనించే స్థితిలో లేడు.

డాడ్జి కారులోని వ్యక్తి ఓపిగ్గా సిగరెట్లు కాలుస్తూ మాటు వేసిన పులిలా కూచున్నాడు అతని కళ్ళు బాంక్ ద్వారంమీదే తాపడం అయిపోయి వున్నాయి.

రెండుగంటలపాటు తిరగాల్సిన చోట్లన్నీ తిరిగి కౌండిన్య కారును యింటివేపు తిప్పాడు. స్పీడుగా వెళ్తూ ఆలోచనల్లో మునిగిపోయాడు. అనుకున్నట్టే రెండు లక్షలు తక్కువపడుతున్నాయి. భజగోవిందం లక్ష ప్రశ్నలు వేశాడు. రెండు గంటలలోగా రెండులక్షలు సర్దడానికి అంగీకరించాడు.

కౌండిన్య కారును తన కాంపౌండులోకి పోనిచ్చాడు. బ్లాక్ డాడ్జి కారు అతని యింటిని దాటి వేగంగా వెళ్ళిపోయింది. రెండువందల గజాల అవతలున్న చిన్న వీధిలోకి తిరిగి ఆగింది.

పోర్టికోలో కారాపి కౌండిన్య దిగాడు. బరువుగా వున్న సూట్‌కేస్‌ని మోస్తూ వరండా మెట్లెక్కి తలుపు తాళం తెరిచాడు. ఇంట్లోకి ప్రవేశించబోతూ మెల్లగా తలతిప్పి రోడ్డువైపు చూశాడు. యెవ్వరూ తనని చూడ్డంలేదు.

అతను గుమ్మం దాటి తలుపు మూసి గొళ్ళెం పెట్టేశాడు. పడగ్గదిలోకి నడిచి సూట్‌కేసుని మంచం కిందికి తోశాడు.

అలసటగా కుర్చీలో కూలబడి, సిగరెట్ వెలిగిం

చాడు. నోరు మండుతోంది. చిరాగ్గా సిగరెట్‌ని పారేసి కళ్ళు మూసుకున్నాడు.

మినిమమ్ బాలెన్స్ వుంచేసి డబ్బంతసీ తీసేసుకుంటున్న అతన్ని బాంక్ మానేజర్లు వెయ్యి ప్రశ్నలు వేశారు. హఠాత్తుగా అమ్మకానికి వచ్చిన స్టూడియోని కొనబోతున్నట్టు వాళ్ళకి చెప్పాడతను.

కౌండిన్య కళ్ళు తెరిచి వాచీ చూశాడు. రెండవడానికి యింకా అరగంట పైనే వుంది. నిన్నట్నుంచి తను యేమీ తినలేదని అతనికి గుర్తొచ్చింది. అయినా ఎందుకో ఆకలిగా లేదు. కడుపు మండుతోంది. కానీ, ఆకలితో కాదు....

రాగయుక్తంగా ధ్వనించిన ఛైమ్స్ విని కౌండిన్య ఉలిక్కిపడి లేచి నిలబడ్డాడు.

ఎవరు? భుజగోవిందం క్యాష్ పంపించాడా? కారు వచ్చిన శబ్దం తనకి వినిపించలేదు. ఆలోచిస్తూ అతను హాల్లోకి అడుగులేశాడు.

ఛైమ్స్ మరోసారి ధ్వనించాయి. తలుపు తెరిచిన కౌండిన్య గుమ్మంలో నిలబడ్డ అపరిచిత వ్యక్తిని ఆశ్చర్యంతో చూశాడు. అతని కనుబొమలు ప్రశ్నార్థకంగా పైకి లేచాయి.

బ్రౌన్ సూటులో వున్న అరడుగుల వ్యక్తి తనవేపు చిరునవ్వుతో చూస్తున్నాడు. పొడుక్కి తగ్గ లావుగా, దృఢంగా వున్న శరీరం. అతని కళ్ళు వజ్రాల్లా వున్నాయి. అతని పెదవులమీద వున్న నవ్వు కళ్ళల్లో లేదు. కౌండిన్య గుండె యెందుకో వేగంగా కొట్టుకోసాగింది.

“మిస్టర్ కౌండిన్యా?” అతని కంఠం బిగ్గరగా

ధ్వనించింది.

"... యస్ .... మీరు ...." కౌండిన్య తడబడ్డాడు. తనున్న విపత్కర పరిస్థితిలో యే అపరిచిత వ్యక్తినీ అతను నమ్మలేకుండా వున్నాడు.

"లోపలికి రావొచ్చా?" అపరిచిత వ్యక్తి ప్రశ్నించాడు, అడ్డుగా నిలబడ్డ కౌండిన్యని అదోలా చూస్తూ.

"మీరెవరు?" ఏం కావాలి?" కౌండిన్య కొంచెం చిరాకుగా అడిగాడు.

అతను మాట్లాడలేదు. మెల్లగా తల తిప్పి, కాంపౌండ్‌నీ, రోడ్డునీ క్షణకాలం చూశాడు. అతని కుడి చెయ్యి కోటు లోపలిజేబులోకి వెళ్ళింది. కౌండిన్య అనుమానంగా, ఆశ్చర్యంగా చూస్తున్నాడు. అతని చెయ్యి యివతలకి వచ్చింది. మెల్లిగా కౌండిన్య ముందుకి సాగింది. అసంకల్పితంగా కౌండిన్య కొంచెం వెనక్కి జరిగాడు.

సగం మూసిన అతని అరచేతిమీదే కౌండిన్య కళ్ళు నిలిచాయి. వేళ్ళని కొద్దిగా తెరుస్తూ అతను అరచేతిలో యిరుక్కున్న కార్డుని కౌండిన్యకి కనిపించేలా పట్టుకున్నాడు. "ఇన్‌స్పెక్టర్, పృథ్వీరాజ్."

కౌండిన్య గుండె దప్పులా కొట్టుకోడం ప్రారంభించింది. కంగారుగా అయోమయంగా తలెత్తి చూశాడు.

14

"మే ఐ కమిన్?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ చేతిని జేబులోకి పోనిస్తూ.

"అయామ్ బిజీ. వాట్ కెన్ ఐ...." కౌండిన్య మాట పూర్తి కాకుండానే అతను సున్నితంగా తోసుకుంటూ

గుమ్మం దాటాడు. తలుపు మూసి గొళ్ళెం పెట్టేశాడు. ఇన్‌స్పెక్టర్ రాక గురించి తనలో పాము పడగల్లా లేస్తున్న వెయ్యి ప్రశ్నలకి సమాధానాలు వూహించలేక కౌండిన్య సతమత మవుతున్నాడు.

"ఇంట్లో యెవ్వరూ వున్నట్టు లేదు....?" అంటూ అతను కౌండిన్యను తోసుకుంటూ పడగ్గది వైపు నడిచాడు. కౌండిన్య అతనివేపు తిరిగాడు. తడి ఆరిపోతున్న పెదవుల్ని నాలుకతో తడుపుకున్నాడు.

"అయామ్ ఎక్స్‌పెక్టింగ్ సమ్‌వన్....మీ కేం కావాలి?" పానకంలో పుడకలా వచ్చిన ఇన్‌స్పెక్టర్‌ని ప్రశ్నించాడు కౌండిన్య.

"ఆ గదిలో మాట్లాడుకుందాం?" అంటూ అతను గబగబా నడిచాడు. కౌండిన్య అయిష్టంగా కదిలాడు.

గది మధ్యలో వున్న సోఫాలో కూచున్న ఆ వ్యక్తి కౌండిన్యను చిరునవ్వుతో చూశాడు. "సిడౌన్!" అన్నాడు. కౌండిన్య కుర్చీలో చతికిలబడ్డాడు.

అతను తీక్షణంగా కౌండిన్యని చూశాడు. "మీ భార్య యెక్కడికి వెళ్ళింది?" ప్రశ్నించాడతను.

"ఇఫ్ ఇటీజ్ ఎనీ ఆఫ్ యువర్ బిజినెస్ ఆమె తన స్నేహితురాలింటికి వెళ్ళింది!" కౌండిన్య విసుగ్గా అన్నాడు. ఆ వ్యక్తి చిన్నగా నవ్వుతూ సిగరెట్ వెలిగించాడు.

"ఇన్‌స్పెక్టర్, మీకేం కావాలి? త్వరగా చెప్పండి" మళ్ళీ కౌండిన్య కంఠంలో విసుగు ధ్వనించింది.

"ఆధారం! మీ భార్య ఎక్కడికి వెళ్ళింది?" ఇన్‌స్పెక్టర్ పృథ్వీరాజ్ నవ్వుతూ అన్నాడు.

"ఇందాకే చెప్పాను!" అన్నాడతను.

ఇన్‌స్పెక్టర్ పృథ్వీరాజ్ చిన్నగా నవ్వాడు. "ఆల్ రైట్. దాగుడుమూత లాడ్డానికి సమయం లేదు. ఇవాళ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రాబ్యాంక్, ఇండియన్ ఓవర్ సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియాల్లో మీరు ఆరు లక్షల దాకా తీసేసుకున్నారు ధీరజ్‌మల్‌కి లాకర్లోంచి పట్టుకెళ్ళిన నగలు అమ్మేశారు. ఒక్క రోజులో అంత పైకం మీకు ఎందుకు కావాల్సి వచ్చింది?"

"అది కూడా మీకు సంబంధించిన వ్యవహారం కాదు" అన్నాడు కౌండిన్య అసహనంగా. ఇన్‌స్పెక్టర్ ఇదంతా ఎందుకు అడుగుతున్నాడో అర్థంకాలేదు.

"మిస్టర్ కౌండిన్యా. చదువుకున్న మీరు విజ్ఞతతో వ్యవహరించి వుండాల్సింది...." అన్నాడు ఇన్‌స్పెక్టర్.

కౌండిన్య చివాల్న తల యెత్తాడు. "యేమిటి మీ అర్థం?"

ఇన్‌స్పెక్టర్ పృథ్వీరాజ్ అతని కళ్ళల్లోకి తదేకంగా చూశాడు. "మీ భార్య కిడ్నాప్ చేయబడింది. పది లక్షలు రాన్సమ్ చెల్లిస్తే గానీ ఆమెకి సేఫ్టీ లేదు..."

కౌండిన్య ఊపిరి పీల్చుకోవడం మరచిపోయాడు. అతని కళ్ళల్లో భయం ఉలితో చెక్కినట్టు ప్రత్యక్షమవుతోంది. "మీకు.... మీకు....ఎలా తెలుసు?"

"పదిలక్షలు మీరు చెల్లించకపోతే, ఆమెకి అబార్షన్ చేయబడుతుంది...." కౌండిన్య ప్రశ్నని వినట్టు ఇన్‌స్పెక్టర్ చెప్పుకుపోతున్నాడు.

కౌండిన్య తటాలున లేచినించున్నాడు. విపరీతమైన భయం అతని రక్తంతో కలిసి శరీరమంతా ఉధృతమైన వేగంతో పాకుతోంది. మొహంమీద చెమటబిందువులు ప్రత్యక్షమవుతున్నాయి. పెదిమలు వణుకుతున్నాయి.

"ఇన్‌స్పెక్టర్ .... మీకు .... ఇదంతా .... ఎలా .... తెలిసింది?" తాత్కాలికంగా అతనికి శక్తి వచ్చినట్టయిపోయింది.

"ఎన్నో కాకులు మాకు కబుర్లు అందజేస్తూ వుంటాయ్!"

కౌండిన్య బలహీనంగా కుర్చీలో కూలబడ్డాడు. ప్రాధేయపూర్వకంగా ఇన్‌స్పెక్టర్ని చూశాడు.

"ఎఫ్ట్లో వచ్చినందుకు మీకు ధన్యవాదాలు. ఇన్‌స్పెక్టర్, నాకో సాయం చేస్తారా?" కౌండిన్య మెల్లిగా అడిగాడు.

"తప్పకుండా!"

"మీరు విన్నదంతా కల్ల అనుకోకండి. చూసిందంతా కల అనుకోండి. దయచేసి వెళ్ళిపోండి. అంతా మరిచిపోండి!" కౌండిన్య కంఠం దీనంగా వుంది.

ఇన్‌స్పెక్టర్ సానుభూతితో చూశాడు. "మీ ఉద్దేశాన్ని అర్థం చేసుకోగలను. మీరు మా దాకా వస్తే ఆమెకి అపాయం సంభవిస్తుంది. బ్లాక్ మెయిలర్ గీసిన గీతని మీరు దాటలేరు! కానీ ...."

"ఇన్‌స్పెక్టర్ అతడు అడిగిందంతా ఇవ్వడానికి నేను సిద్ధంగా వున్నాను. నా భార్య గర్భంలోని శిశువుతో బాటు చెక్కు చెదరకుండా నన్ను చేరుకోవాలి! అంతే!" కౌండిన్య అడ్డొస్తూ అన్నాడు.

"మా ఉద్దేశం కూడా అదే!"

"మీరు రంగంలోకి దిగితే శిరీషకి మరమ్మత్తు చేయలేని అపకారం జరిగిపోతుంది. షీ విల్ బి గాంగ్ రేప్డ్! ఇన్‌స్పెక్టర్, ప్లీస్ .... వెళ్ళిపోండి!" కౌండిన్య నీరసంగా అభ్యర్థించాడు.

ఇన్‌స్పెక్టర్ లేచాడు. తలుపుదాకా నడిచాడు. గిరుక్కున వెనక్కి తిరిగి, కౌండిన్య మొహంలోకి తీక్షణంగా చూశాడు. "డబ్బు చెల్లిస్తే, మీ భార్య సురక్షితంగా తిరిగొస్తుందని మీరు నమ్ముతున్నారా?"

కౌండిన్య కళ్ళు పెద్దగా చేశాడు. "వస్తుందని అతను అన్నాడు...."

"తెగించిన ఆ కసాయివాడిని మీరు నమ్ముతున్నారా?" ఇన్‌స్పెక్టర్ ప్రశ్నించాడు.

"నమ్మక చేయగలిగిందేముంది?" కౌండిన్య బలహీనంగా జవాబిచ్చాడు.

ఇన్‌స్పెక్టర్ అడుగులు వేసి, కౌండిన్య ముందు ఆగాడు. "లెటస్ బీ లాజికల్. మీరు శిరీషను కిడ్నాప్ చేశారనుకుందాం. మిమ్మల్నీ, మీ అనుచరుల్నీ రెండు కళ్ళతో బాగా చూసిన ఆమెని, భవిష్యత్తులో మిమ్మల్ని గుర్తుపట్టగలిగిన ఐ విట్నెస్‌ని మీరు నిర్లక్ష్యంగా వదిలేసి పారిపోతారా?"

కౌండిన్య అయోమయంగా చూశాడు. ఇన్‌స్పెక్టర్ చిరునవ్వు నవ్వాడు.

సాధారణంగా బ్లాక్ మెయిలర్ తన విక్టిమ్‌ని ప్రాణాలతో వదలడు. కిడ్నాప్ కేసుల్లో ఇంతవరకూ అలాంటి సంఘటన జరగలేదనే చెప్పాలి. ఆ బ్లాక్ మెయిలర్ మాటని నమ్మడంవల్ల మీకు కొంత మనశ్శాంతి—తాత్కాలికంగా—కలుగుతుంది. అంతే! యథార్థాన్ని ఎదుర్కొందాం: మీరు డబ్బు చెల్లించాక అతను ఆమెకి తీరుబడిగా అబార్షన్ చేయకపోవచ్చు. ఒకే ఒక బుల్లెట్‌తో ఆమెనీ, గర్భంలోని శిశువునీ అతను అంతం చేస్తాడు;

ఆమె నోటిని శాశ్వతంగా మూసేస్తాడు!"

కాండిస్య దిక్కుతోచనట్టు చూశాడు. "మీ వాదన తార్కికంగా వుంది. నిజం కూడా అంతే కావచ్చు. అయినా, మీరు కేసు పెట్టకుండా వుంటే, నేను అతను చెప్పినట్టు వింటే శిరీష సజీవంగా తిరిగొచ్చే అవకాశం వుంది. మీ గురించి పసిగట్టిన మరుక్షణం ఆమె నాశనం అయిపోతుంది...."

ఇన్‌స్పెక్టర్ కూచున్నాడు. "కీడెంచి మేలెంచమన్నారు. మీరు నమ్ముతున్నట్టు కాకుండా పని ముగియగానే ఆమెను తుదముట్టించి అతను పారిపోతే మీరేం చేస్తారు? కన్నీళ్ళు కారుస్తూ, పళ్ళు కొరుకుతూ మా దగ్గరకొస్తారు. మీ భార్యని అమానుషంగా చంపిన రాక్షసుల్ని శిక్షించమంటారు. మీరు రచయిత. సినిమా కోసం, అమెరికా ప్రజల్ని ఊపేస్తున్న రాంబో లాంటి హీరోని కాగితం మీద సృష్టించి, తెరమీద ఆడించగలరు. అయితే ఆ హీరోలా మీరే స్వయంగా ఈ రంగంలోకి దిగి, సాహసకృత్యాలు చేయలేరు! హంతకుల్ని పట్టుకోలేరు...."

కాండిస్య రెప్ప వేయకుండా చూస్తున్నాడు. సిగరెట్ వెలిగించి పొగ వదులుతూ ఇన్‌స్పెక్టర్ అతన్ని చూశాడు.

"సర్వనాశనం అయిపోయిన తరవాత, ఎప్పుడో తీసుకోబోయే మా సహాయాన్ని యిప్పుడే, సమయం మించిపోనప్పుడే తీసుకోండి!" ఇన్‌స్పెక్టర్ గంభీరంగా అన్నాడు. కాండిస్య తటపటాయిస్తూ చూశాడు.

"నేను.... నేను ఎటూ తేల్చుకోలేకుండా వున్నాను. అయామ్ హెల్ప్‌లెస్!" అతను దీనంగా అన్నాడు.

"మమ్మల్ని సహాయం చేయనివ్వండి! మిస్టర్ కౌండిన్యా, మీరు అతని షరతుల ప్రకారం నిరభ్యంతరంగా డబ్బు చెల్లించండి. మా సహాయం తీసుకుంటున్నట్టు అతనికి తెలియాల్సిన అవసరం లేదు. సరైన క్షణం నుంచి నాటకాన్ని మేం నడుపుతాం!"

"ఇన్ స్పెక్టర్, నాకు....భయంగా, ఆందోళనగా వుంది...." కౌండిన్య నిరుత్సాహంగా అన్నాడు.

"పని పూర్తయ్యాక బ్లాక్ మెయిలర్ మిమ్మల్నీ, మీ కిచ్చిన మాటని పూర్తిగా మరచిపోతాడు. అతనికి కావాల్సింది తన క్షేమం! కుండనిండా పాలు పిండుకున్నాక పొదుగుని కోసేస్తాడు. మీ భార్య క్షేమంగా తిరిగిరాదని నా అనుభవం చెపుతోంది. ఆమెని రక్షించడానికి ప్రయత్నం చేద్దాం. ఆ ప్రయత్నంలో ఆమె మీకు దక్కొచ్చు!" ఇన్ స్పెక్టర్ ఉద్రేకంతో అన్నాడు.

"మీ మాటలు నమ్మాలనిపిస్తోంది. అంతా మీ చేతుల్లోకి వదిలి నిశ్చింతగా వుండాలనిపిస్తోంది. కానీ...." కౌండిన్య యింకా యేదో చెప్పబోయాడు. ఇన్ స్పెక్టర్ అతన్ని అడ్డుకున్నాడు.

"నమ్మండి. మా చేతుల్లోకి వదలండి. నిశ్చింతగా వుండండి!" ఇన్ స్పెక్టర్ నవ్వుతూ ప్రోత్సాహించాడు.

"తన మూడో కన్ను అనుక్షణం నా మీద వుంటుందన్నాడు....అతను మిమ్మల్ని పనికట్టలేడంటారా?" కౌండిన్య సందేహిస్తూ అడిగాడు.

ఇన్ స్పెక్టర్ అతని కళ్ళలోకి చూశాడు. "ఉదయం నుండీ నేను మిమ్మల్ని నీడిలా వెంటాడాను. మీరు గుర్తించారా?"

"నేను మామూలు మనిషిని. అతను ఆరితేరినవాడు!"

కౌండిన్య నవ్వడానికి ప్రయత్నించాడు.

ఇన్‌స్పెక్టర్ కళ్ళు సానపెట్టిన వజ్రాల్లా మెరిశాయి. "మిస్టర్ కౌండిన్యా, మీ బ్లాక్ మెయిలర్ ఒక్కడే అది తెలిసినవాడు కాదు. అది తెలిసిన వాళ్ళు అనేకమంది వున్నారు!" అన్నాడు గంభీరంగా. సిగరెట్‌ని యాష్‌ట్రేలో నొక్కి అతను లేచాడు.

"ఇన్‌స్పెక్టర్, ప్లీజ్ సిడౌన్!" అన్నాడు కౌండిన్య మొదటిసారిగా చిరునవ్వు నవ్వుతూ. ఇన్‌స్పెక్టర్ కూచున్నాడు.

"ఇప్పుడేనా చెప్పండి. ఇదంతా మీకెలా తెలిసింది?" కౌండిన్య ప్రశ్నించాడు.

"ఇవాళ ఉదయం మీకూ బ్లాక్ మెయిలర్‌కీ జరిగిన సంభాషణని మరో వ్యక్తి కూడా విన్నాడు.

"ఎవరా వ్యక్తి?" కౌండిన్య కంగారుగా అడిగాడు. విషయం యెవరిద్వారా బైటికి పొక్కినా అది తన ద్వారానే జరిగిందని బ్లాక్ మెయిలర్ అనుకుంటాడు. అది శిరీషకి ప్రమాదం.

"ట్రంక్ లైన్ చెకప్ చేయడానికి వెళ్ళిన ఒక టెలిఫోన్ మెకానిక్. మొదట్లో అదొక ప్రాక్టికల్ జోక్ అనీ, ఎవరో ఇద్దరు మాట్లాడుకుంటున్నారనీ అతను అనుకున్నాడు. పూర్తిగా విన్నాక భయంకరమైన నేరం జరుగుతోందని అతను నిశ్చయించుకున్నాడు. తిన్నగా మా దగ్గరకొచ్చాడు...."

కౌండిన్య ఆందోళనతో చూశాడు. "ఇన్స్‌పెక్టర్, అతను బైట నోరు విప్పితే, శిరీషకి ప్రమాదం...."

ఇన్స్‌పెక్టర్ పృథ్వీరావ్ చిరునవ్వు నవ్వాడు. "భయపడకండి. బైటికి వెళ్ళకుండా అతన్ని మా దగ్గరే పెట్టు

ఉన్నాం!"

కౌండిన్య నిట్టూర్చాడు తేలిగ్గా. ఇన్స్పెక్టర్ సిగరెట్ వెలిగించాడు. చెయిమ్స్ మోగాయి. కౌండిన్య గాభరాగా ఇన్స్పెక్టర్ని చూశాడు.

"వెళ్ళండి. ఎవరో చూడండి," ఇన్స్పెక్టర్ సలహా ఇచ్చాడు. కౌండిన్య మెల్లిగా లేచి హాల్లోకి నడిచాడు. అతను బాధపడుతున్నట్టు అతని నడకే చెప్తోంది. ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ తలుపు వెనక నిలబడి చెవులు రిక్కించాడు. కౌండిన్య యెవరితోనో నవ్వుతూ మాట్లాడుతున్నాడు. ఇన్స్పెక్టర్ లోపలికి నడిచి కుర్చీలో కూచున్నాడు. చిన్న క్యాష్ బాగ్ తో కౌండిన్య తిరిగొచ్చాడు.

"తక్కువపడిన డబ్బును పట్టుకొచ్చిన వ్యక్తి" అంటూ బాగ్ ని మంచంమీద పడేశాడు.

ఇన్స్పెక్టర్ అతన్ని తదేకంగా చూశాడు. "డబ్బు చెల్లించే విధానం, ప్రదేశం అతను మీకు తెలియజేస్తాడు...."

"యస్...."

"ఆ ప్రదేశం ఆమెని బంధించిన చోటుకి దూరంగా ఉంటుందనే మనం అనుకోవాలి. ఆమెకి దగ్గరగా అతను మిమ్మల్ని ఆహ్వానించడు. అంచేత ఆమెని యెక్కడ బంధించారో మనం ముందుగానే కనిపెట్టే ప్రయత్నం చేయాలి...." అంటూ ఇన్స్పెక్టర్ సాలోచనగా కళ్ళు మూసుకున్నాడు. రెండుక్షణాల తరవాత కళ్ళు తెరిచి కౌండిన్య మొహంలోకి చూశాడు.

"పొద్దుట అతను మీతో అన్నమాటలు చెప్పండి."

కౌండిన్య బ్లాక్ మెయిలర్ కీ తనకీ మధ్య జరిగిన

సంభాషణని కల్పించాడు.

"క్యాసెట్ ద్వారా మీ భార్య ఏం చెప్పింది?"

కౌండిన్య జాలిగా చూసి నిట్టూర్చాడు. "శిరీష విపరీతంగా భయపడింది. ఏడుపుని ఆపుకుంటూ యేమి చేమిటో...."

ఇన్స్పెక్టర్ చెయ్యెత్తి అతన్ని వారించాడు. "మిస్టర్ కౌండిన్యా, మీ భార్య యెలాంటి వ్యక్తి? ఐమీన్ యాకరేజి స్త్రీయా? తెలివైందా?"

"శిరీష చురుకైన పిల్ల!" కౌండిన్య సగర్వంగా అన్నాడు.

"ఆల్ రైట్. ఆమె మాటల్ని ఒక్క అక్షరంకూడా పొల్లుపోకుండా చెప్పండి."

కౌండిన్య తన భావావేశానికి కళ్ళెంవేసి, కళ్ళు మూసుకున్నాడు. అతని హృదయంలో ఇంకా ధ్వనిస్తున్న ఆమె మాటలు అతని కంఠంలో ప్రతిధ్వనించసాగేయి.

"ఏమండీ....ఇప్పటిదాకా క్షేమంగానే వున్నాను. భయంతో రాత్రంతా నిద్రపట్టలేదు .... అతనడిగింది త్వరగా ఇచ్చేయండి. అతను చెప్పినట్టు....జాగ్రత్తగా నడచుకోండి. మీరు పొరపాటుచేస్తే వాళ్ళు ...నాకు.... అబార్షన్ ....యెలాగేనా సరేండి... నేను నేను కానేమో అన్న అనుమానం రావొచ్చు. డార్లింగ్ .... నేను....నీ శిరీష కుసుమాన్ని ....రాజా....నీ దాకుమారిని రక్షించుకో....ఆలస్యం చెయ్యొద్దు...." కౌండిన్య ముగించి కళ్ళు తెరిచి దీనంగా చూశాడు.

ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ జేబులోంచి డైరీతీశాడు. కుడిచేత్తో పేనా పట్టుకుని "మళ్ళీ చెప్పండి" అన్నాడు.

విషాదగీతం పాడుతున్న గాయకుడి కంఠంలో, గాద్గ

ధికంగా కౌండిన్య మళ్ళీ కల్పించాడు. అతని కళ్ళు ఆవే శంతో చెమ్మగిల్లాయి. తను రాసుకున్నదాన్ని ఇన్స్పెక్టర్ మళ్ళీ చదివాడు, ఏకాగ్రతతో. తలెత్తి చూశాడు.

" 'ఏమండీ' అని ప్రారంభించిన మీ భార్య, చివర ఏకవచనం ఉపయోగించింది. మిమ్మల్ని ఏకవచనంతో పిలిచే అలవాటుందా ఆమెకి?"

కౌండిన్య ఆశ్చర్యంతో చూశాడు. ఆ విషయం తన దృష్టికి రాలేదు!

"శిరీష నన్ను బహువచనంతోనే మన్నిస్తుంది...." అన్నాడు మెల్లిగా.

ఇన్స్పెక్టర్ తలపంకించాడు. " 'డార్లింగ్ .... నేను నీ శిరీషకుసుమాన్ని..రాజా. నీ రాకుమారిని రక్షించుకో.. ఆలస్యం చెయ్యొద్దు....' ఇవీ ఆమె చివర్న పలికిన మాటలు. ఇక్కడ ఆమె మిమ్మల్ని 'నువ్వు' అని సంబోధించింది. అవునా?"

కౌండిన్య తలాడించాడు.

"ఆమె పూర్తి పేరు శిరీషకుసుమా?" ఇన్స్పెక్టర్ అడిగాడు.

"కాదు..కమాషాకి ఒకోసారి నేనలా అనేవాణ్ని.."

"ఆమెకి మిమ్మల్ని 'రాజా' అని పిలిచే అలవాటుందా?"

"లేదు."

"మీరామెని 'రాకుమారి' అని పిలిచేవారా?"

"లేదు."

"మిస్టర్ కౌండిన్యా. ఏవేనా ప్రత్యేక సందర్భాల్లో 'రాజా', 'రాకుమారీ' అన్న పదాల్ని ఆమె ఉపయోగించేదా?"

"లేదు....అలాంటి సందర్భాలేవీ తటసించలేదు...."
కాండిన్య మెల్లిగా అన్నాడు. ఈ ప్రశ్నల్ని ఇన్స్పెక్టర్ యెందుకడుగుతున్నాడు? అతను ఇన్స్పెక్టర్ని చూశాడు. "ఇన్స్పెక్టర్, మీకు పెళ్ళయిందా?"

"అఫ్కోర్స్...." ఇన్స్పెక్టర్ జవాబిస్తూ ప్రశ్నార్థకంగా చూశాడు.

కాండిన్య మొహంమీద చిరునవ్వు ప్రత్యక్షమైంది. "ఏకాంతంలో భార్య భర్తని 'రాజా' అంటుంది. భర్త భార్యని 'రాణీ'" అంటాడు. అలా పిలవడానికి కారణం పారవశ్యం. మీకు అర్థమైందనుకుంటాను...."

"అఫ్కోర్స్.... కానీ మీ భార్య పారవశ్యంతో మాట్లాడ్డంలేదు. ఆమె అతిభయంకరమైన అపాయం మధ్య చిక్కుకుంది ఆమె పారవశ్యంలో కాదు, పరులవశంలో వుంది!" ఇన్స్పెక్టర్ నవ్వుతూ అన్నాడు.

కాండిన్య నీరసంగా తలపంకించాడు. ఇన్స్పెక్టర్ తదేకంగా చూశాడు.

"ఏకాంతంలో, పారవశ్యంలో పలికేవిధంగా మీ భార్య ఇప్పుడెందుకు మాట్లాడింది? మిస్టర్ కాండిన్యా, ఆమె ఉద్దేశపూర్వకంగా యేకవచనం ఉపయోగించిందని నాకెందుకో అనిపిస్తోంది...."

కాండిన్య అర్థంకానట్టు చూశాడు. ఇన్స్పెక్టర్ కళ్లు యెందుకో మెరుస్తున్నాయి. "ఆమె మీకు యేదో చెప్పడానికి ప్రయత్నిస్తోంది! ఆమె చెప్పేది మీకు మాత్రమే అర్థంకావాలి!"

కాండిన్య ఉలిక్కిపడ్డట్టు చూశాడు. చిన్నగా నవ్వాడు. "ఇన్స్పెక్టర్, అధికంగా ఆనందం, భయం కలిగినప్పుడూ భరించలేని కష్టం యెదురైనప్పుడూ మనిషి

తలాతోకా లేకుండా మాట్లాడతాడు. ఆవేశంలో అతను భాషనీ, వ్యాకరణాన్ని మరిచిపోతాడు! శిరీష అబల. అస్సహాయ స్థితిలో వున్న నిండు చూలాలు...."

"ఒక్క క్షణం." ఇన్స్పెక్టర్ అడ్డుతగిలాడు. "నిన్నటి సందేశంలో ఆమె ఇలా మీరన్నట్టు తలాతోకా లేకుండా 'రాజా, రాకుమారీ' పదాల్నీ, ఏకవచనాన్నీ ఉపయోగించిందా?"

కౌండిన్య కళ్ళు చిట్లించాడు. "....లేదనుకుంటాను... లేదు...." అన్నాడు గొణుక్కుంటున్నట్టు.

ఇన్స్పెక్టర్ నవ్వాడు. "తను కిడ్నాప్ చేయబడిందని తెలుసుకున్న క్షణంలో కలిగే భయంకన్నా, చెరలో ఒకరోజు గడిచాక కలిగే భయం సహజంగా తక్కువగా వుంటుంది... మీ భార్య మీకు రహస్యంగా యేదో చెప్పే ప్రయత్నం చేసిందనుకుందాం. నష్టమేం లేదు. బోనులో చిక్కిన జంతువుకూడా తప్పించుకోడానికి అనేక మార్గాలు వెతుకుతూ వుంటుంది. ఆపదలో యిరుక్కున్న మనిషికి భయంతోబాటు తెలివీ పెరుగుతుంది. అది సహజ ప్రవృత్తి...." ఇన్స్పెక్టర్ ఆగి సిగరెట్ ముట్టించాడు.

"బాగా గుర్తుచేసుకోండి. 'రాజా, నీ రాకుమారిని రక్షించుకో', అని ఆమె యే సందర్భంలోనూ అనలేదా?"

కౌండిన్య బలహీనంగా తలని అడ్డంగా ఊగించాడు.

"పోనీ మరోవిధంగా అడుగుతాను: ఏదైనా ప్రత్యేక సంఘటనని ఈ డైలాగ్ మీకు గుర్తుచేస్తుందా?" ఇన్స్పెక్టర్ అడిగాడు.

కౌండిన్య అదిరిపడి లేచినించున్నాడు. అతని వొళ్ళు వణకడం ప్రారంభించింది. "మై గాడ్!" అప్రయత్నంగా

అతను అరిచాడు.

"ఏమిటి? చెప్పండి!" ఇన్స్పెక్టర్ కుర్చీ అంచుకి జరిగాడు.

"ఇన్స్పెక్టర్, మీరుపయోగించిన 'డైలాగ్' అన్న పదం నాలో మూసుకుపోయిన యేవో తలుపుల్ని తెరిచింది. మెదడుని కప్పిన యెన్నో పొరల్ని వొలిచి ..."

"కమాన్! అసలు విషయం చెప్పండి!" ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ తీక్షణంగా అన్నాడు.

కౌండిన్య ఆవేశాన్ని ఆపుకునే ప్రయత్నం చేస్తూ కుర్చీలో కూచున్నాడు. "శిరీష హీరోయిన్ గా నటించిన 'యువరాణి' చిత్రానికి నేనే రచన చేశాను. ఆ చిత్రం ద్వారానే మా పరిచయం, పరిణయం జరిగాయి. ఆ చిత్రంలో హీరోయిన్, యువరాణి డైలాగ్ నే శిరీష ఇప్పుడు ఉచ్చరించింది!"

ఇన్స్పెక్టర్ కళ్ళు నిగ్గుపుల్లలా వెలిగాయి. "హీరోయిన్ ఆ డైలాగ్ ని సినిమాలో యెప్పుడు పలికింది?" ఆవేశంతో అడిగాడతను.

"కౌండిన్య కళ్ళు మూసుకున్నాడు. "ఆ జానపద చిత్రానికి రచన చేసి ఆరేళ్లు దాటింది. కాసేపు ఆలోచించుకోనివ్వండి.... యస్ .... అవును..... 'యువరాణి' చిత్రంలో రాకుమారిని విలన్ ఒక కొండగుహలో బంధిస్తాడు. అప్పుడు హీరోయిన్ హాస్యనటిద్వారా హీరోకి ఒక సందేశం పంపిస్తుంది. అక్కడ దొరికిన ఒక ఎండుటాకుమీద కళ్ళకి పెట్టుకున్న కాటుకతో తన సందేశం రాస్తుంది. ఆ సందేశం ఒక్కే ఒక్క వాక్యం: "రాజా, నీ రాకుమారిని రక్షించుకో!" చెప్పడం ముగించి కౌండిన్య కళ్ళు తెరిచి చూశాడు.

ఇన్స్పెక్టర్ తటాలున లేచి నిలబడ్డాడు. "థాంక్యూ మిస్టర్ కౌండిన్యా! మీ భార్య సాధారణ స్త్రీ కాదు. బ్లాక్ మెయిలర్ తనని కొండగుహాలో బంధించాడని ఆమె మాకు తెలియచేసింది. రిమార్కబుల్."

కౌండిన్య పొంగిపోతూ చూశాడు. "మీకు ధన్యవాదాలు చెప్పుకోవాలి నేను. మీ తర్కం ఆమె అందించిన రహస్యాన్ని ఇవతలికి లాగింది!"

"మనిద్దరం తర్వాత మీ భార్యకి ధన్యవాదాలు చెప్పుకుందాం! మిస్టర్ కౌండిన్యా, ఆమె బంధించబడిన కొండ గుహ ఎక్కడుంది?" ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ నొసలు చిట్లిస్తూ గబగబా అని మళ్ళీ ఇలా అన్నాడు.

"ఇవాళ యేదో ఒక సమయంలో బ్లాక్ మెయిలర్ మీకు ఫోన్ చేస్తాడు. రాన్సమ్ పైకం యెక్కడ, యెప్పుడు, యెలా చెల్లించాలో తెలియజేస్తాడు. ఆమెని జాగ్రత్తగా మీకు అప్పగించమని ఆత్రుతగా అడగండి. కంగారు వ్యక్తం చేయండి. అతను చెప్పింది తు.చ. తప్పకుండా పాటించండి...." అంటూ ఇన్స్పెక్టర్ డైరీలోంచీ కాగితాన్ని చింపి యేదో రాసి, కాగితాన్ని కౌండిన్యకి అందించాడు. "ఈ నంబరుకి ఫోన్ చేయండి. ఈ ఫోన్ దగ్గరే పాతుకుపోయి వుంటాను. అతను చెప్పిందంతా నాకు తెలియజేయండి."

15

తనముందు టేబుల్ మీద పరిచిన ఫారెస్టు అండ్ హిల్ యేరియా మాప్ ని క్షుణ్ణంగా పరిశీలించి, ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ కుర్చీలో వెనక్కి వాలాడు. సిగరెట్ వెలిగించి, తన కుర్చీకి ఇరువైపులా నిలబడ్డ నలుగురు ఇన్స్పెక్టర్లని కలయజూశాడు.

"పట్నానికి ముప్పై కిలోమీటర్ల దూరంలో కొండల వరస ప్రారంభమవుతుంది. ఫారెస్టు డిపార్టుమెంట్ ఆ పర్వతశ్రేణిని ఎనిమిది కొండలుగా విభజించింది. అన్ని కొండల్లోనూ గుహలున్నాయి. ఫారెస్టు గార్డు ఏడు కొండలు చెప్పిందాన్నిబట్టి, వాటిలో ఒకటైన నగారా కొండలో చాలా గుహలున్నాయి. నగారా కొండ ఆంధ్రా, కర్ణాటక, తమిళనాడు బోర్డర్లు కలిసే చోటికి దగ్గరగా వుంది...." ఇన్స్పెక్టర్ ఆగి మాప్ మీద పడున్న రెడ్ పెన్సిల్ని అందుకున్నాడు.

నలుగురు ఇన్స్పెక్టర్లూ ముందుకి వంగారు. ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ చేతిలోని పెన్సిల్ తో మాప్ మీద ఒక చోట గుండ్రంగా ఒక వృత్తాన్ని గీసింది. "నా అంచనా ప్రకారం, లభించిన ఆధారాల ప్రకారం—ఈ గుహల్లో యెక్కడో నేరస్థుడు దాక్కున్నాడు. ఎన్. హెచ్. ఫోర్ నుండీ చీలే మఫ్యూసిల్ రోడ్డునుండీ పది కిలోమీటర్ల బండి బాట కొండ అడుగు భాగాన్ని కలుపుతుంది...."

ఎర్ర పెన్సిల్ మొదటి వృత్తంచుట్టూ మరో పెద్ద వృత్తాన్ని గీసింది. "దాదాపుగా ఈ వృత్తం వున్న యేరియాలో ఎక్కడో ఒకచోట పైకం పనులు జరగొచ్చు. పనయ్యాక నేరస్థుడు ఏ రాష్ట్రంలోకి మాయమవుతాడో చెప్పలేం. అంచేత మూడు రాష్ట్రాల్లోకీ వెళ్ళే రోడ్లమీద, సరైన చోట్లలో నిఘా యేర్పాటు చేయాలి.." ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ తలతిప్పి ఇన్స్పెక్టర్ కుమార్ వైపు చూశాడు.

"యస్సర్...." అన్నాడు కుమార్.

"కుమార్, మూడు వాన్స్‌లో సాయుధ సిబ్బందినీ, అంబులెన్సుల్నీ సిద్ధంగా వుంచు. పట్నానికి దూరంగా దాక్కున్న నేరస్తుడు యేదో వాహనాన్ని ఉపయోగిస్తూ ఉండివుండాలి. ఆ రోడ్స్‌లో బోర్డర్స్ దాటి వెళ్ళే ప్రతీ వాహనాన్నీ ఆపి చెక్ చేయండి. అనుమానం వచ్చిన ప్రతి వ్యక్తినీ నయానో భయానా అదుపులోకి తీసుకోండి. మూడోగంటలు యేదో ఆటో మొబైల్‌లో పారిపోడానికి వాళ్ళు ప్రయత్నిస్తారు....

"బోర్డర్ యేరియాస్‌లోని తమిళనాడు, కర్ణాటక పోలీసులతో నేను మాట్లాడాను. మీకు పూర్తిగా వాళ్లు సహకరిస్తారు. ఇన్స్‌పెక్టర్ కుమార్ మీకు నాయకత్వం వహిస్తాడు. ఏదేనా తెలియగానే నన్ను కాంటాక్టు చేయండి. 'ఆపరేషన్ మిడ్‌నైట్' కోడ్‌ని ఉపయోగించండి" ఇన్స్‌పెక్టర్ పృధ్వీరావ్ ఉత్తరు విచ్చాడు.

"యస్సర్!" అన్నారు ఇన్స్‌పెక్టర్స్ ఏకకంఠంతో.

"రఘురాం నువ్వు ఇక్కడే వుండు. నీకు వేరే పని ఇస్తాను."

"యస్సర్."

"సార్...." కుమార్ పిలిచాడు.

ఇన్స్‌పెక్టర్ పృధ్వీరావ్ అతనివేపు చూశాడు. "అతను మళ్ళీ ఫోన్ చేయడానికి సిటీలో, ఆటువైపున ఉన్న టౌన్స్‌కి వెళ్ళొచ్చు. నగారా కొండలోకి చుట్టు పక్కలున్న టౌన్స్‌లో, సిటీ లిమిట్స్‌లో అతనికోసం వలవేస్తే...."

"మనకొక్కవాల్సింది అతను కాదు! బ్లాక్ మెయిలర్స్ చాలా జాగ్రత్తగా ప్లాన్ చేస్తారు. నిర్ణీత సమయంలో ఆ వ్యక్తి తిరిగి వెళ్ళకపోతే పిక్టెమ్‌మీద పగతీస్కుకో

వచ్చు. విక్టిమ్ మనకంటె బదేదాకా అతను ఆడమన్నట్టు మనం ఆడాలి. అదేమంచిది. నౌ గో ఎ హెడ్!" పృథ్వీరాజ్ నవ్వుతూ అన్నాడు.

16

"చదివింపులు సిద్ధంగా వున్నాయా?" బొంగురు కంఠం అడిగింది.

"ఎప్పుడు, ఎక్కడ, ఎలా అందచేయాలో చెప్పు. నా భార్య నాకు త్వరగా కావాలి. డోంట్ వేస్ట్ టైమ్!" కౌండిన్య కొంచెం ఆదుర్దాగా అన్నాడు.

"నోట్ల గురించి అన్ని జాగ్రత్తలూ తీసుకున్నావా?" అతను వెటకారంగా అడిగాడు.

"నువ్వు చెప్పిన జాగ్రత్తలన్నీ తీసుకున్నాను. నాకు నువ్వో నీ బలగం అక్కర్లేదు; నా భార్య కావాలి! ఐ వాంట్ మై వైఫ్ బాక్. నాట్ ది డర్టీ మనీ!"

"ఓ.కే. సరుకుని రెండు నల్లటి సూట్ కేసుల్లో సర్దు. నీ కారులో పడేసుకో. రాత్రి సరిగ్గా పదిగంటలకి బయలుదేరు. మామూలు స్పీడులో మద్రాసు రోడ్డుమ్మట పోనీ. నలభై కిలోమీటర్లు వెళ్ళాక ఎడమవైపు చీలుతున్న రోడ్లోకి తిరిగి ఒక కిలోమీటరు వెళ్ళు. కారాపి కిందికి దిగు. రోడ్డుకి ఎడమవైపున వున్న ఊడలమర్రిచెట్టు వెంట్రుకలు విరబోసుకున్న దెయ్యంలా కనిపిస్తుంది. సూట్ కేసుల్ని మోసుకుంటూ మర్రిచెట్టు కిందికి వెళ్ళు. అగ్గిపుల్ల గీయటం లాంటిది, టార్చి వెలిగించటం లాంటిది చేయకు.

పదకొండో నెంబరు ఊడదగ్గరగా సూట్ కేసుల్ని పెట్టెయ్. తిరిగిచూడకుండా నీ కారువైపు వెళ్ళిపో. స్టీరింగ్ ముందు కూచో. సిగరెట్ ముట్టించి, అగ్గిపుల్లని

కింద పడేయ్. ఒక నిమిషంపాటు అలాగే కూచో. తరువాత కారును వెనక్కి తిప్పి మెయిన్ రోడ్డు చేరుకో. అర్థమైందా?' బొంగురుకంఠం ప్రశ్నించింది.

"అర్థమైంది...." కౌండిన్య మెల్లిగా అన్నాడు.

"సిటీవైపు తిరగొద్దు. ఎడమకి తిరుగు. ఆపకుండా యాభై కిలోమీటర్లు వెళ్ళు. చిన్న టౌన చేరుకుంటావ్. అక్కడున్న హోటల్ హైవేలో నీ పేరులో ఇరవై నాలుగో నెంబరు గది రిజర్వ్ చేయబడింది. ఆ గదిలో దిగు..."

"జస్ట్ మోమెంట్! నువ్వడిగింది నీకు ఇచ్చేశాక, నా భార్యను వదిలెయ్. ఆమెను తీసుకుని నా దారిన నేను పోతాను...." కౌండిన్య కంగారుగా అడ్డు వస్తూ అన్నాడు.

"మై డియర్ ఫేమస్ రైటర్! డబ్బుని నమ్మినట్టు నేను మనిషిని నమ్మను. నా రోటకి క్షేమంగా చేరుకున్న తరువాత, నువ్వు పోలీసుల్ని ఉసిగొలపలేదని నికరంగా తెలుసుకున్నాక నీ భార్య ఉనికి నీకు తెలియజేయబడుతుంది. అంతవరకూ ఆమె నాకు కవచంగా వుంటుంది!"

"ఇది అన్యాయం. నేను ఎవ్వరికీ యేమీ చెప్పను. నిన్నూ, నీకిచ్చిన డబ్బునీ పూర్తిగా మరిచిపోతాను" కౌండిన్య ఆత్రుతగా అన్నాడు.

"పూర్తిగా విను: నేను ఆడమన్నట్టు నువ్వు ఆడక పోతే, నాకు అనుమానం వేస్తే నీ సూట్ కేసులు మర్రిచెట్టుకిందే వుంటాయి. నేను యిదివరకే ప్రామిస్ చేసిన శిక్షలన్నీ అమలుజరిపించి నా దారిన పోతాను. నువ్వు గాలించి పట్టుకునేసరికి శిశువు చేరుకున్న లోకాన్నే అబార్షన్ జరిగిన తల్లి కూడా చేరుకుంటుంది!"

"....అలాంటిదేం జరగవు....ప్లీజ్...."

"జరక్కపోవడం నీ భార్యకూ, ఆమె మోస్తున్న శిశువుకూ మంచిది! చెప్పినట్టు చెయ్. తప్పటడుగు వేయకు!"

అటువైపున ఫోను డిస్కనెక్టు చేయబడింది.

17

ఆకాశంలో నక్షత్రాలు గుడ్డిగా వెలుగుతున్నాయి. గుహకి కొంచెం దూరంలో బండరాతిమీద పరమేశ్వర్ కూచున్నాడు. అనుచరులు ముగ్గురూ అతని ముందు నించున్నారు. లోపల బంధించబడి ఉన్న శిరీష తను మాటల్ని వినకుండా వుండటానికి పరమేశ్వర్ అక్కడ సమావేశం యేర్పాటు చేశాడు.

"చేపిన ఆవు త్వరలో మనకి కడివెడుపాలని అందిస్తుంది. ఎవరి వాటా వాళ్ళు జుర్రుకోవచ్చు!" పరమేశ్వర్ పెదవుల మధ్య యిరుక్కున్న సిగరెట్ అతని మాటలకి అనుగుణంగా కదులుతూ గాలిలో గీతలు గీస్తోంది, ఎర్రగా.

"స్ప్లెన్‌డిడ్!" కమల్ ఉత్సాహంతో అరిచాడు.

"డాన్, శ్రుతి తగ్గించు. అవతల నీ పేషెంటు వింటుంది!" పరమేశ్వర్ హెచ్చరించాడు. "నా అంచనా ప్రకారం సరిగ్గా పన్నెండింటికి ధనలక్ష్మి మన వొళ్ళో వాలుతుంది. ఆ తరువాత గంటలోగా మనం యిక్కణ్ణుంచీ మాయమైపోవాలి...."

"వాటాలు యిక్కడే పంచేసుకోవడం మంచిదని నా సలహా" కమల్ వేళ్ళు కదుపుతూ అన్నాడు. రాజు, భద్రం సాక్షుల్లా చూస్తూ నించున్నారు.

"సలహాలివ్వడానికి నువ్విక్కడికి రాలేదు! పనయ్యాక పేషెంటుని తీసుకుని మనం మరో స్థావరం చేరుకుంటాం.

ఆతను మనమీద యేవిధమైన చర్య తీసుకోవడంలేదని రూఢి చేసుకున్నాక ఆమెని వదిలి పెడదాం."

"బాస్, ఎక్స్‌క్యూజ్ మీ...." రాజు మెల్లిగా అన్నాడు. "పాలు పితుక్కున్నాక ఆవుని వదిలేయడం క్షేమం అని నాకు అనిపిస్తోంది. కిడ్నాప్ చేసిన వ్యక్తిని అక్కడికీ ఇక్కడికీ తీసుకెళ్ళడం ప్రమాదం!"

పరమేశ్వర్ నోట్లో సిగరెట్ పెకీ కిందికి ఆడింది. "మనల్ని క్షేమంగా వుంచడానికే ఆమె మనతో వస్తోంది. ఒక వేళ కాండిన్స్ ప్రోద్బలంతో పోలీసులు మన కోసం గాలిస్తారనుకుందాం. ఆమె మన కస్టడీలో వున్నంతకాలం యెవ్వరూ మనల్ని సమీపించలేరు!" అంటూ మెరుస్తున్న నక్షత్రాలకేసి చూశాడు.

"స్కార్లెట్ డిన్నర్ పూర్తి చేసుకుని నువ్వూ నేనూ వెళ్దాం. భద్రం, డాక్టర్ యిక్కడ కాపలా వుంటారు. మనం తిరిగొచ్చేలోగా అన్నీ సర్ది రెడీగా వుంచుతాడు. ఆ తరువాత నెల్లూరులోంచి మనుష్యుల్లోకి పోదాం! ఓ.కే?"

"అవాగన్ అక్కర్లేదా? ఏదో స్ట్రీట్ మీట్ చేస్తేగానీ నాకు తోచదు!" కమల్ మెల్లిగా అరిచాడు.

"గుర్రం బండిని లాగినప్పుడు కమ్చీ ఉపయోగించక్కర్లేదు!"

"కోసుకొచ్చిన గులాబీని నలిపి పెంటకు చేయక పోయినా, కనీసం వాసన చూడకుండా తోటలోకి గిరాటేయడం మూర్ఖత్వం!" కమల్ అసంతృప్తితో అన్నాడు.

పరమేశ్వర్ కమల్ వైపు చీకట్లో కడ్డగూలా తీక్షణంగా చూశాడు. "కమల్ నీ ఆలోచనల్ని దారి

మళ్ళించు. మన దృష్టి డబ్బుమీదే వుండాలి. డబ్బు మందలుగా మగువల్ని నీ కాళ్ళముందు పడేస్తుంది!" అతను కటువుగా అన్నాడు.

క్షణం ఆగి "భద్రం, స్టార్ లైట్ డిన్నర్!" పరమేశ్వర్ ఆర్డరిచ్చాడు. భద్రం గబగబా గుహవైపు కదిలాడు. కమల్ అసహనంగా కదిలి, సిగరెట్ వెలిగించాడు.

18

కోపంగా, అసహనంగా కాండిన్య అటూ ఇటూ తిరుగుతున్నాడు. స్కాండల్! డబ్బివ్వగానే శిరీషని వదిలి పెడతానన్న నీచుడు ఆమెని కవచంగా వాడుకోబోతున్నాడు! అప్రయత్నంగా అతని పిడికిళ్ళు బిగుసుకున్నాయి ఎదురుపడితే వాడిని తన చేతులతో హతమార్చాలనిపిస్తోంది తనకి. మంచంమీద పడున్న రెండు నల్లటి సూట్ కేసులవైపు అసహ్యంగా చూశాడతను. డబ్బు! డబ్బు తనని ఈ దురవస్థలో పడేసింది. తగు మాత్రంగా ఉన్న డబ్బు సంతోషాన్నీ, శాంతినీ ఇస్తుంది. అధికమయ్యాక అదేడబ్బు మనిషిని అష్టకష్టాల్లో పడేస్తుంది!

టెలిఫోన్ మోత అతన్ని వర్తమానంలోకి లాగింది. పచార్లు మాని రిసీవర్ అందుకున్నాడతను.

"మిస్టర్ కాండిన్యా! ఇన్స్పెక్టర్ పృథ్వీరాజ్ కంఠం అతనిలోని టెన్షన్ని క్షణంలో తగ్గించింది.

"ఇన్స్పెక్టర్ గారూ....అయామ్ సారీ ఆలోచనల్లో మునిగి మీకు రింగ్ చేయడం మరిచాను... అతను సూచనలిచ్చాడు...." కాండిన్య బ్లాక్ మెయిలర్ చెప్పిందంతా ఇన్స్పెక్టర్కి వినిపించాడు. "మీరు చెప్పిందంతా

నిజమే అనిపిస్తోంది....రక్షణగా వాడుతున్న శిరీషని వాడు వదిలి పెడతాడంటే ఇప్పుడు నాకు నమ్మకం కలగటంలేదు.... ఇన్స్పెక్టర్....!" కౌండిన్య తడబడుతూ అన్నాడు.

"మిస్టర్ కౌండిన్యా, నెవర్ బిలీవ్ క్రూక్! తన ప్రాణంకోసం బ్లాక్ మెయిలర్ తల్లి గొంతుకోయడానికి వెనదీయాడు! ఆల్ రైట్....తను దాక్కున్న ప్రదేశానికి దూరంగా, మరో వైపున అతను 'పికప్ సీన్' యేర్పాటు చేశాడు...."

"ఆ ప్రదేశం యెక్కడుందో కనిపెట్టారా ఇన్స్పెక్టర్?" కౌండిన్య ప్రశ్నించాడు.

"మనకి లభించిన ఒకటి రెండు ఆధారాల్నిబట్టి అతను నగారా కొండల్లో వుండాలని అనుకుంటున్నా.."

"ఇన్స్పెక్టర్, ఏం చేయాలనుకుంటున్నారు?" కౌండిన్య ఆత్రంగా అడిగాడు.

"మిస్టర్ కౌండిన్యా, బ్లాక్ మెయిలర్ సూచనలకి ఒకటి రెండు సవరణలు చెప్తాను. ఆ ప్రకారం చేస్తారా?" కౌండిన్య ప్రశ్నకి సమాధానం చెప్పకుండా ఇన్స్పెక్టర్ ప్రశ్నించాడు.

కౌండిన్య నిట్టూర్చాడు.

ఇన్స్పెక్టర్ చిన్నగా నవ్వాడు. "అన్నీ అతను చెప్పినట్టే చేయండి కార్ని వెనక్కి తిప్పి యాభై కిలో మీటర్ల దూరంలో వున్న టౌన్ కి వెళ్ళకండి. అయిదు కిలోమీటర్లు వెళ్ళి ఆగండి...."

"అతను చూస్తూంటాడు .... పర్వాలేదంటారా?" కౌండిన్య భయం భయంగా అడిగాడు.

"లంకెబిందెలు చిక్కేక అతను మిమ్మల్ని చూస్తూ కూచోడని నా నమ్మకం...."

164

"ఇన్స్పెక్టర్, చివరి క్షణాల్లో అతని మాటల్ని నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం జరగొచ్చు. అతను వెళ్ళమన్న చోటికి...." అనుమానంతో, కంగారుతో కౌండిన్య చెప్పుకుపోతున్నాడు.

"యస్. విశ్వాసపూరితంగా మాట్లాడుతూ వీపులో బాకు దిగేసేవాళ్ళని విశ్వసించకండి!"

"ఇన్స్పెక్టర్, అంతరాంతరాల్లో వాడిని నమ్మాలని లేదు. కానీ నేను .... నేను ... ఈ క్షణాల్లో నిస్సహాయుణ్ని!" కౌండిన్య దీనంగా అన్నాడు

"చట్టం మీకు సహాయంగా వుంది. ఇట్సాల్ రైట్. ముందట అతను చెప్పినట్టూ, తరవాత నేను చెప్పినట్టూ చేయండి. గుడ్ లక్!"

—ముగింపు వచ్చే సంచికలో